# ఎంత ముందుచూపో!



ఎంతైనా అదానిలకు ముందు చూపు ఎక్కువే! అందుకే అవినీతిపై వాటాదారులను ముందుగానే హెచ్చరించారు. ' మేము ప్రభుత్వంలోని అధికారులకు, రాజకీయ నాయకులకు చట్ట వ్యతిరేక చెల్లింపులకు వ్యతిరేకం. ఎటువంటి అవినీతిని, లంచాలను ప్రోత్సహించం. మా ఉద్యోగులకు అదే విషయాన్ని చెబుతాం. మేం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా మా ఉద్యోగులు అటువంటి చర్యలకు పాల్పడే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితుల్లో అవినీతి వ్యతిరేక చట్టాలు ప్రభావం చూపుతాయి. అదే జరిగితే, సంస్థపై పెనాల్టీలు విధించడంతో పాటు, అనేక ఆర్థిక, ఆర్థికేతర చర్యలు తీసుకునే అవకాశం ఉంది' అని అదాని గ్రీన్ సంస్థ ఆఫర్ లెటర్లో వినియోగదారులను హెచ్చరించినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు.

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

ప్రత్యేక సంచిక



# అవినీతి కిలాడీలు రక్షణలో పాలకులు



Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 118 | విజయవాడ | 4 పేజీలు వెల : 2

Vol No | Vijayawada | Rs

## అదాని అవినీతి

# పాలకుల మూగనోము

**బి. తులసీదాస్**

అదాని గ్రూపు సంస్థలు ఉత్పత్తి చేసే సౌర విద్యుత్తును దేశంలోని వివిధ విద్యుత్ పంపిణీ సంస్థలు కొనుగోలు చేయడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు అదాని గ్రూపు భారీగా ముడుపులు చెల్లించిందని అమెరికా కోర్టులో కేసు నమోదు కావడం పెను సంచలనం కలిగించింది. ముడుపుల మొత్తం రూ. 2,029 కోట్లు కాగా అందులో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్దకు రూ.1,750 కోట్లు ముట్టజెప్పారన్నది ప్రధాన అభియోగం. దీంతో గౌతం అదాని ఒక అంతర్జాతీయ మోసగాడని మరోసారి రుజువయింది.

### మోడీ సర్కారు వింత వాదన

ఈ కుంభకోణంతో కేంద్రానికి సంబంధం లేదనీ ఆ ఐదు రాష్ట్రాలదేననీ కేంద్ర ప్రభుత్వమూ, బిజెపి పెద్దలూ అంటున్నారు. కానీ ఈ పాపాల పుట్ట కేంద్రం నుండి పుట్టిందే కదా! దేశంలోని విద్యుత్ పంపిణీ సంస్థలు తాము వినియోగించే మొత్తం విద్యుత్తులో కనీసం 10 శాతాన్ని కేంద్రీకృత సౌర విద్యుత్ ప్లాంట్ల నుంచి కొనుగోలు చేయాల్సిందేనని, (రెన్యువబుల్ ఎనర్జీ పర్చేజ్ ఆబ్లిగేషన్(ఆర్‌పిపిఒ)) కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశించిన మాట నిజం కాదా? కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఏర్పడిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఇసిఐ–సెకి)యే కదా ఈ ఒప్పందాలు చేసింది. కార్పొరేట్ల నుంచి విద్యుత్తును ఎక్కువ ఖరీదుకు కొనుగోలు చేసి బలవంతంగా రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలకు అంటగట్టే బ్రోకర్ గా సెకి తయారైంది. ఇందుకోసం యూనిట్‌కు ఏడు పైసల కమిషన్ కూడా తీసుకుంటామని ఈ ఒప్పందాల్లో సైతం పేర్కొంది కూడా! ఆర్‌పిపిఒ ను కండిషన్‌గా చూపి, ఇతర ఆశలు పెట్టి సెకి రాష్ట్రాల డిస్కంలతో ఒప్పందాలు చేసుకుంటోంది. కనుక ఈ ఒప్పందాలకు మూల కారకులు కేంద్ర పాలకులేనన్నది నిర్వివాదాంశం. అదాని అవినీతికి ప్రధాన రక్షకులు వారే!

### వైసిపి బుకాయింపులు

మేం కేంద్ర ప్రభుత్వ సంస్థయైన సెకితో ఒప్పందం చేసుకున్నాం తప్ప అదానితో కాదన్న వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట వాదనకు నిలబడేది కాదు, వాస్తవ విరుద్ధమైనది కూడా! రాష్ట్ర ప్రభుత్వ రంగంలోని మూడు డిస్కంల సిఎండిలు చేసుకున్న ఒప్పందంలో విద్యుత్ సరఫరా అదాని గ్రీన్ నుండి జరుగుతుందనీ, కమిషన్‌గా సెకి కి యూనిట్‌కు ఏడు పైసలు చెల్లిస్తామనీ సంతకాలు చేశారు కదా! ఇక ఒప్పందం అదానితో కాదంటూ బుకాయిస్తే ఎలా? జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సౌర విద్యుత్ ఒప్పందమేగాక అదానికి అనేక రూపాల్లో ఈ రాష్ట్ర సంపదను హారతి పళ్లెంలో పెట్టి అప్పగించిన మాట వాస్తవం కాదా? విశాఖపట్నం మధురవాడలో డేటా సెంటర్ పేరిట రూ. వేల కోట్ల విలువ చేసే 270 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పగించారు. గంగవరం పోర్టు యజమాని డివిఎస్ రాజు కుటుంబాన్ని ఇడి, సిబిఐ ద్వారా బెదిరించి అదాని గుంజుకున్నారు. ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వానికున్న 10.4 శాతం వాటాను జగన్ సర్కారు అదానికే కారుచౌకగా అప్పగించింది. శ్రీకాకుళం జిల్లాలో కొత్తగా నిర్మిస్తున్న మూలపాడు పోర్టు కూడా అదే అదాని గ్రూపునకు కట్టబెట్టారు. ఐదు జిల్లాల్లో 6,200 మెగావాట్ల పంప్డ్ స్టోరేజి పవర్ ప్రాజెక్టులను ఎలాంటి టెండర్లూ లేకుండానే కట్టబెట్టారు. అంతకుమించి ఏజెన్సీ (ఐదవ షెడ్యూల్ ప్రాంతం)లో రాజ్యాంగాన్ని, పీసా చట్టాన్ని సైతం ఉల్లంఘించి అదానీకి ఇచ్చేశారు కదా! ఇన్ని చేసి మళ్లీ బుకాయింపులా?



### చంద్రబాబు మౌనం వెనుక...!

ప్రతిపక్షంలో ఉండగా సెకి ఒప్పందంపై విమర్శలు చేసిన టిడిపి నాయకులు ఇప్పుడు నోరెత్తడం లేదు. ఒప్పందంలో రూ.2029 కోట్ల అవినీతి ఉందని, అందులో రూ.1757 కోట్లు జగన్‌కు అందినట్లు అమెరికా న్యాయ విభాగం తేల్చిన నేపథ్యంలో ఒప్పందంలో ఏముందో వివరించే పత్రాలను బయటపెట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. రూ.1.99 పైసలకు వచ్చే విద్యుత్‌ను రూ.2.49 పైసలకు గత ప్రభుత్వం ఎందుకు కొన్నదో బయటపెట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆ పనిచేయకపోతే ఈ విషయంలో జగన్ మోహన్ రెడ్డిని సమర్థించినట్లే భావించాల్సి ఉంటుంది. చంద్రబాబు, జగన్ విధానాలు ఒక్కటేననీ, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు వచ్చారు తప్ప, రాష్ట్రంలో ఇంకేమీ మారలేదని ఎవరైనా అంటే కాదనలేము కదా! పాత విధానాలే అమలవుతున్నాయని, అదానీతో జగన్ చేసుకున్న ఒప్పందాలను చంద్రబాబు కొనసాగిస్తున్నారని జనం భావించక తప్పదు. అలాగే, మోడీ, జగన్ ఇద్దరూ మంచి స్నేహితులు కనుక కేంద్రంలోనూ దీనిపై చర్చ లేదు. కేంద్రంలో భాగస్వామిగా ఉన్న టిడిపి కూడా ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ కుంభకోణం గురించి కానీ అదాని పేరు కానీ ప్రస్తావించేందుకు కూడా సాహసించ లేదు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మౌనం వీడి జగన్‌పై చర్య తీసుకోవాలన్నది జన వాక్యం.

సెకి తో డిస్కంలు ఒప్పందం చేసుకోవడాన్ని సిపిఎం, ఇతర వామపక్ష పార్టీలు వ్యతిరేకించాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఎదుట పబ్లిక్ హియరింగ్‌లలో ఆయా సందర్భాల్లో లేవనెత్తారు. అయితే, ఈఆర్‌సి యథావిధిగా బుల్డోజ్ చేసింది.

### ప్రజలపై భారాలు


సోలార్ విద్యుత్ యూనిట్ రూ.1.99 కి టెండర్లు పడిన రోజుల్లో సెకితో రూ.2.49 కి కొంటామని ఒప్పందం చేసుకున్నారు. దానికి తోడు అంతర్రాష్ట్ర రవాణా (ఐఎస్‌టిఎస్) చార్జీల పేరిట యూనిట్‌కు రూ.1.70 అదనం. 25 ఏళ్లపాటు రాష్ట్ర ప్రజలు లక్ష కోట్ల రూపాయలు చెల్లించాల్సి వుంటుంది. ఇది మోయలేని భారమే! రాష్ట్రంలో ఇటీవల తీసుకొచ్చిన ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు కూడా అదాని కంపెనీవే! ఇప్పుడున్న మీటర్లు కచ్చితంగా పని చేస్తున్నాగాని మీటర్ మార్చాల్సిందే! దాని విలువ 13 నుండి 18 వేల రూపాయలు ఏడు నుండి తొమ్మిదేళ్లలో నెలనెలా వినియోగదారులే చెల్లించాలి. మోడీ సర్కారు తెచ్చిన ఆర్‌పిపిఒ పర్యవసానంగా రాష్ట్రంలో విద్యుత్ సంస్థలు కచ్చితంగా వినియోగించాలనే (మస్ట్ రన్) కేటగిరీ కింద సెకితో ఒప్పందాలు చేసుకున్నాయి. రాష్ట్రప్రభుత్వం జెన్‌కో ఆధ్వర్యంలో వేలాది కోట్ల రూపాయలు వెచ్చించి నెలకొల్పిన థర్మల్ ప్లాంట్ల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోకుండా, ప్రైవేటు కంపెనీల సోలార్ తప్పనిసరిగా వినియోగించుకోవలసిన కేటగిరీ కింద ఒప్పందం చేసుకోవడం ప్రభుత్వ రంగాన్ని దెబ్బతీయడానికే! ఈ ఒప్పందాల పర్యవసానంగా విద్యుత్ కొనుగోలు ఖర్చు పెరిగింది. ఇలాంటి నిర్ణయాలమూలంగా విధిస్తున్న ఎఫ్‌పిపిసిఎ చార్జీలను వ్యతిరేకించాల్సిందే. గతంలో కొన్న విద్యుత్‌కు ఇప్పుడు చార్జీలు విధించడం అంటే గత విద్యుత్ చార్జీల టారిఫ్‌ను ఇప్పుడు పెంచడమే అవుతుంది. ఇది వాయిదా వేసిన చార్జీల టారిఫ్ పెంపుదలగా భావించాలి. ఏ సరుకుకూ లేని విధంగా గతంలో వాడిన దానికి ఇప్పుడు రేట్లు పెంచి వసూలు చేయడం దారుణం. అందువల్ల ఈ ట్రూఅప్, సర్దుబాటు చార్జీల విధానాన్ని వ్యతిరేకించాలి.

అమెరికా కోర్టులో కేసు నమోదైన వెంటనే కెన్యా ప్రభుత్వం అదాని గ్రూపుతో చేసుకున్న ఎయిర్‌పోర్ట్ ఒప్పందాన్ని రద్దు చేసింది. శ్రీలంక ప్రభుత్వం అదాని గ్రూపుతో ఒప్పందాలపట్ల పునరాలోచన చేస్తున్నట్టు ప్రకటించింది. బంగ్లాదేశ్ సర్కారు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేసింది. అదే విధంగా మన రాష్ట్రంలో అదాని గ్రూపుతో చేసుకున్న విద్యుత్, పోర్టులు, డేటా సెంటర్ తదితర ఒప్పందాలన్నిటినీ ప్రభుత్వం రద్దు చేయడం అవశ్యం. గౌతం అదాని, ఇతర నిందితులను అరెస్టు చేయాలి. ఈ దిశగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. కానీ వారంతట వారు చేస్తారని ఆశించలేం కనుక ప్రజా ఉద్యమాలతో ఒత్తిడి పెంచాలి. కార్పొరేట్లకు, ప్రభుత్వాధినేతలకు మధ్యగల 'బలమైన బంధాన్ని' బద్దలుకొట్టాలి.

# మహా కుంభకోణం

## ఒప్పందాల రద్దు - అదానీని అరెస్టు చేయాలి

**ప్రజాశక్తి ఇంటర్వ్యూలో వి. శ్రీనివాసరావు**



అదాని చేసింది మామూలు కుంభకోణం కాదని. అది మహాకుంభకోణమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. అదాని కుంభకోణంపై ప్రజాశక్తి ఒంగోలు బ్యూరో ఇంఛార్జి ఎస్‌వి బ్రహ్మంకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన అనేక అంశాలు వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ ఇలాంటి కుంభకోణం జరగలేదని చెప్పారు.

ప్రజాధనం దుర్వినియోగంతోపాటు ప్రజలపై పాతికేళ్లపాటు రూ.లక్షలకోట్ల భారాలు మోపడానికి ఈ ఒప్పందాలు కారణమయ్యాయని చెప్పారు.

**ప్రశ్న: ఇటీవల జరిగిన అదాని కుంభకోణం వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టం ఏమిటి?**

**జ:** రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని కుంభకోణంగా భావిస్తున్నాం. రూ.1750 కోట్లు లంచం తీసుకుని చేసిన ఒప్పందాల వల్ల ప్రజల భూములను లాగేసుకోవడంతో పాటు రూ.లక్షల కోట్ల భారాలు ప్రజలపైనే పడుతున్నాయి. ఏజన్సీ ప్రాంతాల్లో భూములను బలవంతంగా అదానికి కట్టబెట్టారు. యూనిట్ విద్యుత్ రానున్న కాలంలో సోలార్ విద్యుత్ యూనిట్ ఇరవై ఐదు పైసలకే వచ్చే అవకాశం ఉంది. అయినా గత ప్రభుత్వం పాతికేళ్ల పాటు యూనిట్‌ను రూ.2.49లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకుంది. అదిగాక అంతర్రాష్ట్ర రవాణా ఛార్జీలు (ఐఎస్‌టిఎస్) రూ.1.70 ఛార్జీ అదనం. ప్రజలపై తీవ్ర భారాలు పడతాయి.

**ప్ర: మేము సెకీతో ఒప్పందం చేసుకున్నాం.. అదానీతో కాదని వైసిపి చెబుతోంది కదా? మీరేమంటారు?**

**జ :** సెకితో ఒప్పందం తప్ప అదానీతో కాదని జగన్ చెప్పడం అవాస్తవం. అదానీతో ఒప్పందం కోసమే కేంద్రం సెకీని రంగంలోకి దించింది. రాష్ట్రాల వారీగా మాట్లాడుకునే దానికన్నా సెకితో ఒప్పందం చేసుకుంటే సులువుగా ఉంటుంది. సెకీ మాట వింటారనే భావనతోనే రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. పైగా సెకీ ఒప్పందంలో కొనుగోలుతోపాటు సరఫరా కూడా చేసేలా గత ప్రభుత్వం అదాని కంపెనీతో ఉత్తరప్రత్యుత్తరాలు జరిపింది.

**ప్ర: కుంభకోణంలో కేంద్రం పాత్ర ఏమిటి?**

**జ :** కుంభకోణం సుత్రధారే కేంద్రం. మోడీ, అదాని ఇద్దరూ కలిసి ఆపరేషన్ చేశారు. రాష్ట్రంలో సోలార్ విద్యుత్ టెండర్లు పిలిచినా వాటిని రద్దు చేశారు. అదానీతో జగన్ మూడుసార్లు సమావేశం జరిపి ఒప్పందం చేసుకున్నారు. అదానీని రాష్ట్రానికి పంపి మోడీ కథ నడిపారు. పైగా సెకీ కేంద్ర సంస్థ. కేంద్రం అనుమతిలేకుండా ఒక్క అడుగు కూడా వేయదు.

**ప్ర : చంద్రబాబునాయుడు, జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ ఉప్పు నిప్పులా ఉంటారు కదా? అడ్డంగా దొరికిన జగన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?**

**జ :** అదానీని ఆదుకునేందుకు జగన్‌ను కూడా పరోక్షంగా ఆదుకుంటున్నారు. కేంద్రంలో అదానీకి పట్టుంది. మోడీ, అదానీ కలిసి మోదానిగా మారి పాలన సాగిస్తున్నారు. గత ప్రభుత్వం అదానీకి రాష్ట్రంలోని వనరులన్నీ కొల్లగొట్టిపెట్టింది. విద్యుత్ ఒప్పందాలతోపాటు పోర్టులు, హైవేలను దౌర్జన్యంగా లాగేసుకున్నారు. మోడీకి తలొగ్గి అదానీని రాష్ట్రంలో అందలం ఎక్కించారు. జగన్‌పై కేసులు పెడితే అదానీకి నష్టం. ఇద్దర్ని రక్షించేందుకు చంద్రబాబు ప్రభుత్వంపై మోడీ వత్తిడి ఉంది. మోడీ పెత్తనానికి భయపడే అదానీని, జగన్‌ను చంద్రబాబు కాపాడుతున్నారు.


**ప్ర: ఇపుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి?**

**జ:** రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యగా అదానీ మహా కుంభకోణం నేపథ్యంలో ఒప్పందాలు అన్నీ రద్దు చేసుకోవాలి. వారికి కేటాయించిన భూములను వెనక్కు తీసుకోవాలి. గంగవరం పోర్టును విశాఖ ఉక్కుకు కేటాయించాలి. అవినీతిపరులపై చర్యలు తీసుకునేందుకు వీలుగా లంచం తీసుకున్న వారిపేర్లను రాబట్టాలి. అమెరికా కోర్టులో ఉన్నందున అదానీకి నోటీసులు ఇచ్చారు. వెంటనే అదానీని అరెస్టు చేయాలి. న్యాయవిచారణకు ఆదేశించాలి.

**ప్ర: ఈ అంశంపై సిపిఎం తదుపరి కార్యాచరణ ప్రణాళిక ఏమిటి?**

**జ:** సిపిఎం మొదటి నుంచీ సెకీ ఒప్పందాలను వ్యతిరేకిస్తోంది. ఆనాడే ఆధారాలతోసహా లెక్కలు చూపి విచారణ జరపాలని డిమాండు చేసింది. అదానీతో ముడిపడి ఉన్న స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించడం జరిగింది. నేడు అవి పెనుభారంగా మారాయి. ఈ నష్టాలపై ఆనాడు తెలుగుదేశం మౌనంగా ఉంది. ఇపుడు అదానీతో ఒప్పందాలు రద్దు చేసుకోవడానికి సిద్ధంగా లేదు. ఆనాడు వ్యతిరేకించిన స్మార్ట్‌మీటర్లను అధికారంలోకి రాగానే ఇపుడు పెడుతున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీని కూడా ఉల్లంఘించారు. ఒప్పందాలు రద్దు, స్మార్ట్‌మీటర్లు వద్దు.. ట్రూ అప్‌ఛార్జీలు రద్దు, అదాని అరెస్టు, అవినీతిపై న్యాయవిచారణ జరపాలనే డిమాండ్లతో ప్రజలను చైతన్యం చేసేందుకు రాష్ట్రంలో సెమినార్లు, సదస్సులు నిర్వహిస్తున్నాం. వామపక్ష పార్టీలు, మేధావులు, ప్రజా సంఘాలతో సంప్రదించి ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికకు పూనుకుంటాం.

### అధ్యయనం చేసి స్పందిస్తాం



అమెరికా కోర్టులో వేసిన ఛార్జిషీట్ మా వద్ద ఉంది. దానిని అధ్యయనం చేసి స్పందిస్తాం. జగన్ చేసిన అవినీతి అంశం ప్రస్తావించడానికి కూడా ఇబ్బందికరమైన పరిస్థితి. రాష్ట్రప్రభుత్వం ఈ విషయాన్ని జాగ్రత్తగా గమనిస్తోంది. మరింత సమాచారం తీసుకుని తగిన విధంగా స్పందిస్తాం..

**– ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

### నా పేరు ఎక్కడా లేదు



అమెరికాలో నమోదైన డాక్యుమెంట్‌లో ఎక్కడా నా పేరు లేదు. కేంద్రానికి చెందిన సెకి, రాష్ట్రప్రభుత్వ డిస్కమ్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. మధ్యలో థర్డుపార్టీ ఎక్కడ? నేను సంపద సృష్టిస్తే బాబు ఖాళీ చేస్తున్నారు.

**– వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి,** మాజీ ముఖ్యమంత్రి

### ముగ్గురూ దోస్తులే



మోడీ, చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి ముగ్గురూ దోస్తులే. కానీ పక్షంలో జగన్‌పై మోడీ, చంద్రబాబు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? చిన్న వ్యక్తులపై ఇడి,సిబిఐలను ప్రయోగించిన మోడీ అదాని విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారు?

**– బివి రాఘవులు,** సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు

### మౌనం సరికాదు



అదాని అవినీతి వ్యవహారాల గురించి రాష్ట్రప్రభుత్వం మౌనంగా ఉండటం మంచిది కాదు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో వైసిపి నాయకులు ఈ దోపిడీలో పాలుపంచుకున్నారు. శాసనసభలో చంద్రబాబు అదాని పేరు కూడా ప్రస్తావించలేకపోయారు

**– కె రామకృష్ణ,** సిపిఐ రాష్ట్రకార్యదర్శి

### విచారణ జరపండి



అదానితో జగన్ చేసుకున్న ఒప్పందాలన్నింటిపై విచారణ జరగాలి. అదాని కంపెనీని రాష్ట్రంలో బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి. అదానీ దేశ పరువు తీస్తే, జగన్ రాష్ట్రపరువు తీశారు.

**– వైఎస్ షర్మిల,** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు

### రాష్ట్రంలో కేసు పెట్టాలి



అదానీపైనా, జగన్‌పైనా రాష్ట్రంలో కేసు పెట్టి విచారణ జరపాలి. రాష్ట్రప్రభుత్వం కేవలం జగన్‌పై కేసు నమోదు చేసి చేతులు దులుపుకోవాలనుకుంటోంది. అదానీని పెంచి పోషిస్తోంది మోడీ, అమిత్‌షాలే. అమెరికాలో నమోదైన కేసులో అదానీకి శిక్ష పడటం దాదాపు ఖాయం.

**– వడ్డే శోభనాద్రీశ్వరరావు,** మాజీ మంత్రి

# వైఫల్యానికి నిదర్శనం

**ఇఎఎస్ శర్మ**



(అదాని కుంభకోణంపై మాజీ కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖ కార్యదర్శి ఇఎఎస్ శర్మ కేంద్ర ఆర్థిక శాఖామాత్యులు నిర్మలా సీతారామన్ కు రాసిన లేఖ .. ఆయన మాటల్లోనే)

**కేంద్ర ఆర్థికశాఖా మాత్యులు**
**నిర్మలా సీతారామన్ గారికి,**

భారత దేశంలోనూ, అమెరికాలో కూడా గౌతమ్ అదానీ, మరికొందరు దురుద్దేశపూర్వకంగా చట్టవ్యతిరేకంగా ఆర్థికనేరాలకు పాల్పడినట్టు అమెరికన్ జిల్లా కోర్టు చేసిన నేరారోపణను నేను ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ఆ క్రమంలో ఉభయ దేశాల్లోని మదుపుదారుల దృష్టికి రాని విధంగా లంచగొండితనానికి, అవినీతికి గౌతమ్ అదానీ తదితరులు పాల్పడ్డారని ఆ ఆరోపణ పేర్కొంది.


అమెరికాలో జిల్లా కోర్టు, సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ కమిషన్ అక్కడి చట్ట వ్యవస్థ అధికారులు. అమెరికాలో ఎస్ఇసి మాదిరిగానే భారతదేశంలో సెబి (సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) కూడా ఇక్కడి అధికార వ్యవస్థ. అందుచేత అమెరికాలో అక్కడి అధికార వ్యవస్థలు చేసిన ఆరోపణలను ఇక్కడ మొత్తంగా తోసివేయడం కుదరదు. ఐతే ఇప్పటివరకూ మీరు, మీ సహచరులు అదే చేస్తూవస్తున్నారు. ఎఫ్‌బిఐ సంస్థ అటు అమెరికాలో, ఇటు ఇండియాలో చాలా శ్రమకోర్చి సాక్ష్యాధారాలను సేకరించి ఆ ప్రాతిపదికన ఈ నేరారోపణ చేసింది.

**మన మదుపరులకేది రక్షణ?**

అమెరికన్ మదుపరుల ప్రయోజనాలను పరిరక్షించడం కోసం, అవినీతిని నిరోధించడం కోసం అదానీ గ్రూపు మీద చర్యలు తీసుకోడానికి ఎస్ఇసి సిద్ధపడుతోంది. అదే మాదిరిగా ఇక్కడ ఆర్థిక మంత్రిత్వ శాఖ, సెబి, సిబిఐ, ఇడి తదితర సంస్థలు కూడా మన మదుపరుల ప్రయోజనాలను, ముఖ్యంగా మీ ఆధ్వర్యంలో నడిచే ప్రభుత్వ రం బ్యాంకుల ప్రయోజనాలను, అంతకన్నా ముఖ్యంగా ప్రభుత్వ ఖజానాకు నిధులను సమకూర్చే మన టాక్స్ పేయర్ల ప్రయోజనాలను పరిరక్షించడానికి పూనుకోవాలని నేను కోరుకుంటున్నాను. నిరంతరం ఆత్మరక్షణ దశలో పడిపోయి, ఎంతసేపూ నిరాకరించడమే పనిగా పెట్టుకున్న మీ మంత్రిత్వ శాఖ ఎందుకు పక్షపాతంతో పడివుందో వివరణకు కూడా అందని స్థితి ఉంది. దీని ఫలితంగా దేశీయ మదుపరుల, దేశీయ టాక్స్ పేయర్ల ప్రయోజనాలు దెబ్బ తింటున్నాయి.

ఈ అదానీ ఉదంతం దురదృష్టవశాత్తూ దేశంలోను, రాష్ట్రాలలో సైతం వ్యవస్థలు కుప్పకూలిపోయాయని సూచిస్తున్నది. దీని ప్రభావం ఇంతింతై ఇటు దేశీయంగా టాక్స్ పేయర్లను మోసం చేయడంతోబాటు, అటు దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది, ఏ పాపమూ ఎరుగని విద్యుత్ వినియోదారుల ప్రయోజనాలను దెబ్బ తీస్తుంది. నా దృష్టిలో ఆందోళన కలిగిస్తున్న విషయాలను దిగువన ఇస్తున్నాను:

1. దేశం లోని ఆ యా రాష్ట్రాల విద్యుత్ పంపిణీ సంస్థలు తాము వినియోగించే మొత్తం విద్యుత్తు లో కనీసం 10 శాతాన్ని అదానీ గ్రూపు వంటి కార్పొరేట్ సంస్థలు స్థాపించిన కేంద్రీకృత సౌర విద్యుత్ ప్లాంట్ల నుంచి, విదేశీ సంస్థ అయిన ఎజ్యూర్ నుంచి ఎంత ఖరీదుకైనా సరే కొనుగోలు చేయాల్సిందేనని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశించింది. 2003 విద్యుత్ చట్టం లోని సెక్షన్ 11 కింద ఇచ్చిన ఈ ఆదేశం చట్ట విరుద్ధం. ఈ ఆదేశాల ద్వారా కేంద్రమే అవినీతికి అవకాశాలు కల్పించింది. ఇప్పుడు ఆ రెండు సంస్థలూ అమెరికన్ కోర్టు లో నేరారోపణను ఎదుర్కొంటున్నాయి. భవనాల పైకప్పులమీద ఏర్పాటు చేయగల చిన్న చిన్న సౌర విద్యుత్ ప్లాంట్ల ద్వారా, వ్యవసాయ మోటారు పంపుసెట్లను నడిపించగల ప్లాంట్ల ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తిని, పంపిణీని వికేంద్రీకరించే విధానానికి బదులు కేంద్రీకృతంగా భారీ సౌర విద్యుత్ ప్లాంట్లను కార్పొరేట్లు నిర్వహించడానికి కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖే స్వయంగా పూనుకోవడం కన్నా అన్యాయం ఉండదు. కేంద్రీకృత సౌర విద్యుత్ ప్లాంట్లు స్వత:సిద్ధంగానే ఆర్థికంగా లాభసాటిగా నడవడం అసాధ్యం. వీటికి ఎక్కువ పెట్టుబడులు అవసరం అవుతాయి. చాలా తక్కువ లోడ్





మిగతా 2లో



## అవినీతి కిలాడీలు


రక్షణలో పాలకులు



# అదాని ముడుపులు - అడ్డగోలు సమర్థనలు

కె.గడ్డెన్న

**ఆసియాలోనే అతిపెద్ద వ్యాపారవేత్త, ప్రధాని నరేంద్ర మోడీ అనుంగు మిత్రుడు గౌతమ్ అదాని, ఆయన ఆరుగురు ఎగ్జిక్యుటివ్ అధికారులపై అమెరికా న్యాయ శాఖ పేల్చిన బాంబు దేశం లోపల, బయటా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ అంశంపై గత మూడు నాలుగు రోజులుగా పార్లమెంటు స్తంభించిపోయింది. స్టాక్ మార్కెట్ తీవ్ర ఒడుదుడుకులకు గురైంది. అదానీ వ్యాపార మోడల్ డొల్లతనం మరోసారి బయటపడింది. క్రోనీ కేపిటలిజానికి ఇదొక అత్యుత్తమ ఉదాహరణగా నిలిచింది. వచ్చే ఇరవై ఏళ్లలో 17వేల కోట్ల మేర లాభాలు పోగుపడేలా 12 గిగావాట్ల సోలార్ విద్యుత్ కాంట్రాక్టులను అడ్డదారిలో చేజిక్కించుకునేందుకు, వాటి అమలుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూసుకునేందుకు ప్రభుత్వాల్లో ఉన్న పెద్దలకు, అధికారులకు రూ. 2029 కోట్ల లంచాలను ఎలా ఎరగా వేసినదీ, కేటగిరీల వారీగా ఎవరెవరికి ఎంతెంత ముడుపులు ముట్టజెప్పినదీ, ఈ మొత్తం అవినీతి, మోసాలను దాచి పెట్టి అమెరికన్ ఇన్వెస్టర్ల నుంచి, బ్యాంకుల నుంచి పెట్టుబడులు ఎలా సేకరించిందీ అమెరికా న్యాయ శాఖ న్యూయార్క్ కోర్టుకు సమర్పించిన 54 పేజీల అభియోగ పత్రంలో వివరించింది. గౌతమ్ అదానీ మేనల్లుడు సాగర్ అదానీ నుండి స్పష్టమైన ఆధారాలు లభించిన మీదటే అదానీపై ఈ అభియోగాలు మోపినట్లు అమెరికన్ న్యాయశాఖ, స్టాక్ ఎక్స్ఛేంజి కమిషన్ (ఎస్ఇసి) తెలిపాయి. దీంతో ఆత్మ రక్షణలో పడిన మోదానీ (మోడీ+అదాని), వారి అధీనంలోని గోడీ మీడియా ఎదురు దాడికి దిగాయి. అడ్డగోలు వాదనలతో విమర్శకుల నోళ్లు మూయించాలని చూస్తున్నాయి. సోషల్ మీడియాను దుర్వినియోగపరుస్తున్నాయి. ఈ అభినవ గోబెల్స్ సాగిస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టక పోతే అదే నిజమనుకునే ప్రమాదముంది.**




**మొదటి వాదన:** భారత దేశ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే దేశ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఈ విధమైన కుట్ర పన్నారు. అదాని వ్యాపార కార్యకలాపాలు భారత్‌లో జరిగితే అమెరికాకు సంబంధమేంటి? ఇది భారత్‌పై దాడి కాదా?

**వాస్తవం:** అదాని వ్యాపార సామ్రాజ్యం భారత్‌కే పరిమితమైనట్టిది కాదు.. ఆసియా నుంచి ఆఫ్రికా దాకా ఖండాంతరాలకు ఇది విస్తరించింది. కేంద్రంలోని నరేంద్ర మోడీ పదేళ్ల పాలనలో బిజెపి అవినీతితో బాటు అదాని అవినీతి కూడా పెనవేసుకుని పోయింది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి (క్రోనీ కేపిటలిజం) ఇదొక పరాకాష్ట. అదానీ కంపెనీల అవినీతిని బయటపెట్టే సాహసం దేశంలో మీడియా చేయడం లేదు. ఒక వేళ ఎవరైనా ప్రయత్నిస్తే ఏం జరుగుతుందో ఎన్‌డి టివి ఉదంతం, న్యూస్ క్లిక్ ఎడిటర్ అరెస్టు, ఆల్ట్ న్యూస్ ఎడిటర్ పై వేధింపులు మచ్చుకు కొన్ని ఉదాహరణలు. ఇప్పటికే మీడియాలో అత్యధిక భాగం అదాని, అంబాని గుప్పెట్లోకి పోయింది. ఈ స్థితిలో భారత్‌లో జరిగిన కార్పొరేట్ల అవినీతి అక్రమాలను విదేశీ సంస్థలు బయటపెడితే కానీ తెలియని దుస్థితి ఏర్పడింది. ఇది మనకు దేశ ప్రతిష్టను పెంచుతుందా?

అదాని కంపెనీల అవినీతి అక్రమాలపై దేశంలో ఏ వ్యాపార సంస్థపైన లేనన్ని ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఏ ఒక్క దానిపైనా బిజెపి ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం ఇచ్చిన అలుసుతోనే ఆ కార్పొరేట్ దిగ్గజం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. దీనిని ప్రశ్నిస్తే దేశ అభివృద్ధిని ఓర్వలేకే ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని ఎదురు దాడికి దిగుతున్నారు. ఇటువంటి చర్యల వల్ల దేశ ప్రతిష్ట పెరుగుతుం దా?. అమెరికాలో ఇన్వెస్టర్ల నుంచి, బ్యాంకుల నుంచి, అదానీ కంపెనీలు పెట్టుబడులు సేకరించేటప్పుడు అక్కడి ఇన్వెస్టర్లకు, బ్యాంకులకు వాస్తవాలు తెలియ జేయకుండా దాచిపెట్టడం అమెరికా చట్టాల ప్రకారం నేరం. అందుకే ఫారిన్ కరప్షన్ ప్రాక్టీసెస్ యాక్టు కింద అమెరికా న్యాయశాఖ అదానిపైన, మరో ఆరుగురి అధికారులపైన అభియోగాలు మోపింది. దీనిలో కుట్ర ఏముంది?

**రెండవ వాదన:** అదానిపై సంచలనాత్మక ఆరోపణలు పార్లమెంటు సమావేశాలు ప్రారంభానికి ముందే తేవడం రాజకీయ దురుద్దేశంతో చేస్తున్నదేనని బిజెపి కేంద్ర మంత్రి ఒకరు సెలవిచ్చారు.

**వాస్తవం:** గతంలో బోఫోర్స్, హర్షద్ మెహతా స్టాక్, బొగ్గు కుంభకోణాలు ఇదే విధంగా పార్లమెంటు సమావేశాలకు ముందే బయటకొచ్చాయి. అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడే ఎందుకు తెస్తున్నట్టు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే మోదానీ అవినీతి భాగోతం బయటపడి వుంటే అప్పుడు బిజెపి ఇంకా గగ్గోలు పెట్టేది. అదీగాక పార్లమెంటు నడవకపోవడానికి కారణం మోడీ ప్రభుత్వ జవాబుదారీ రాహిత్యమే.. అదానీ సచ్చరితుడు అని ప్రధాని భావించి ఉంటే అదే విషయాన్ని పార్లమెంటులో ప్రకటన చేయవచ్చు. ఈ వ్యవహారంపై జెపిసి విచారణతో సహా దేనికైనా ప్రభుత్వం సిద్ధమని ప్రకటించవచ్చు. తనకెలాంటి అభ్యంతరం లేదని స్పష్టమైన ప్రకటన చేయడానికి పార్లమెంటును వేదికగా ప్రధాని ఉపయోగించుకోవచ్చు కదా. తద్వారా మోడీ ప్రతిష్ట, దేశ ప్రతిష్ట పెరుగుతుంది. పోనీ, అమెరికా న్యాయ శాఖ చేసిన అభియోగాలు తప్పు అని మోడీ ప్రభుత్వం నిజంగా భావిస్తే దానిని ఖండించవచ్చు. లేదా నిరసన తెలియజేయొచ్చు.తప్పు జరిగిందని భావిస్తే విచారణకు ఆదేశించవచ్చు. ఆ పని చేయకుండా ఏం చెప్పినా ప్రజలు విశ్వసించరు.

**మూడవ వాదన:** అదాని ఆర్థిక నేరాలకు పాల్పడినట్లు ఎలాంటి నిర్దిష్ట ఆధారాలు లేవు. దీనివల్ల భారత ప్రజలకు వచ్చిన నష్టమేమీ లేదు. ఇదంతా గ్లోబల్ మీడియా సృష్టేనని అదాని మద్దతుదారులు చెబుతున్నారు.

**వాస్తవం:** అదాని విదేశాల్లో డొల్ల కంపెనీలు పెట్టి వాటిని స్టాక్‌మార్కెట్‌లో లిస్టింగ్ చేసి షేర్ల విలువను కృత్రిమంగా పెంచేసిన వైనాన్ని హిండెన్‌బర్గ్ నివేదిక ఇంతకుముందు బయటపెట్టినప్పుడూ ఇదే రకమైన వాదనతో అదానీని ప్రభుత్వం కాపాడింది. ప్రతిపక్షాలు ఎంత గీ పెట్టినా విచారణకు మోడీ ససేమిరా అన్నారు.. తాజా కుంభకోణంలో కూడా అదానీని కాపాడేందుకు మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్లుగా ఉంది. అందుకే పార్లమెంటు స్తంభించినా సరే దీనిపై నోరు విప్పేది లేదని భీష్మించుక్కూర్చొన్నారు. మోడీకి అత్యంత సన్నిహితుడైన అదానీ జోలికి వెళ్లే సాహసం దేశంలో మీడియా చేయడం లేదు. అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ సూచీలో భారత్ స్థానం 161కి పడిపోయిందంటేనే మీడియాపై ప్రభుత్వ నియంత్రణ ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తూనే ఉంది. ఇటువంటి స్థితిలో గ్లోబల్ మీడియా ఈ వార్తలను ఇస్తే దానిని తప్పుబట్టడం ఎంతవరకు సబబు? ఇక భారత ప్రజలకు జరిగే నష్టం విషయానికొస్తే ఇంతకు ముందు బొగ్గు కుంభ కోణం కానీ, మరొకటి కానీ జరిగినప్పుడు అది ప్రభుత్వ సహకారంతో సహజ వనరులను కొల్లగొట్టుకుపోవడానికే పరిమితం. ఇప్పుడీ కుంభకోణం అంతకంటే తీవ్రమైనది. అటు దేశ సంపదను, ఇటు నేరుగా ప్రజల జేబులకు చిల్లులు పెడుతుంది. సోలార్ విద్యుత్ కాంట్రాక్టులను చేజిక్కించుకోవడానికి విద్యుత్ యూనిట్ రేటు ఎంత ఉండాలో ముందుగానే నిర్ణయించి ప్రభుత్వాలను అందుకు ఒప్పించేందుకు లంచాల ఎర వేస్తున్నది.

ఈ ఒప్పందాల ద్వారా అప్పనంగా రూ. 17 వేల కోట్ల లాభాలను అదానీ కంపెనీ మూటగట్టుకుంటుంది. ఆ విధంగా విద్యుత్ బిల్లులు మోత మోగించేందుకు ఈ ఒప్పందాలు రాచమార్గం ఏర్పరుస్తున్నాయి. ఇప్పటికే ట్రూ ఆప్ చార్జీల పేరుతో వినియోగదారులపై విపరీతమైన భారాన్ని మోపుతున్నారు. రేపు ఈ ఒప్పందాలు అమల్లోకి వస్తే విద్యుత్ ఛాలా ఖరీదైపోతుంది. ఇది ప్రజలకు నష్టం కాదా?

## ఎందుకు అరెస్టు చేయరు?



అదాని కుంభకోణం క్రోనీ క్యాపిటలిజానికి ఒక ఉదాహరణ. బాధ్యులపై నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలి. న్యాయం జరిగేలా చూడాలి. తక్షణమే అదానిని అరెస్టు చేయాలి."

– "చిన్నచిన్న ఆరోపణలకే ప్రజల్ని అరెస్టు చేస్తున్నారు. అదే జెంటిల్‌మెన్ గౌతమ్ అదాని వేలకోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు వచ్చినా అరెస్టు చేయరా? జైల్లో వుండాల్సిన అదానిని కేంద్రప్రభుత్వమే కాపాడుతోంది.

**– రాహుల్ గాంధీ**

## అందరికీ మేలుకొలుపు



అదాని కుంభకోణం మనందరికీ మేల్కొలుపు. అధికారంలో ఉన్న వారి నుండి మరింత పారదర్శకత, జవాబుదారీతనం డిమాండ్ చేయాలి.

**– అరవింద్ కేజ్రీవాల్**




## జాతీయ పత్రికల వ్యాఖ్యానాలు

అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఇసి) అభియోగాలు, నిధుల సమీకరణపై గల ప్రభావాల దష్ట్యా ఈసారి అదానీలు మరింత క్లిష్టమైన సమయాన్ని ఎదుర్కొనాల్సి వుంటుంది. చాలా తక్కువ సమయంలోనే ఇన్ని వివాదాల్లో ఒక బడా కార్పొరేట్ సంస్థ చిక్కుకోవడం చాలా అరుదు.

**– టైమ్స్ ఆఫ్ ఇండియా**

అదాని గ్రూపుపై ఆరోపణలు వచ్చినప్పుడల్లా బిజెపి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమర్థించాలనే చూస్తోంది. కానీ, ఇప్పుడు 'చట్టం తన పని తాను చేసుకుపోతుంది. అయితే అది జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే వుంది.

**– డెక్కన్ హెరాల్డ్ పత్రిక**

ఈ విషయంపై స్పష్టత రావాలంటే సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ అవసరం.

**– ట్రిబ్యూన్**

భారతీయ మార్కెట్లను దెబ్బతీయడానికి అంతర్జాతీయంగా పన్నిన కుట్రలో భాగమే ఇది అంటూ బిజెపి ప్రతినిధి వ్యాఖ్యానించడం చూస్తుంటే భారతీయ ఇన్వెస్టర్ల తెలివితేటలను అవమానించడమే అవుతుంది.

**ఇండియన్ ఎక్స్‌ప్రెస్**

ముడుపులు ఇతరులకు అందాయా? లేదా?, సెకీ కేవలం ఒక సాధనంగా మాత్రమే వుందా? లేదా? అన్న విషయాలను భారత పౌరులు కచ్చితంగా తెలుసుకోవాల్సి వుంది.

**– ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్**

## కొత్త ప్రతిజ్ఞ

దేశ సకల జనులారా,
సంతోషించండి సంబరాలు చేసుకొండి
దేశంలో దొంగలు పడ్డారు!
ఇంతింతై ఎదిగి, ప్రపంచమంతా విస్తరించారు
దేశ భక్తులారా,
హృదయాలను ఉప్పొంగించి, గర్వపడండి..

నీదనో నాదనో మనందరివీ అనో
ఇన్నేళ్లుగా అనుకున్న
ప్రభుత్వరంగపు పాడియావులన్నీ
మోళీజాలపు మాయాగానానికి
'పర'వశమవుతున్నందుకు మీరూ తలలూపండి
తన్మయులవ్వండి తరించండి!
మన సాగర తీరాలూ, సకల ప్రకృతి వనరులూ
ఆ ఇద్దరి ఇంటికి లాభాతోరణాలు అవుతున్నందుకు
మీ ఛాతులను యాభయ్యారు అంగుళాలకు
మించి విస్తరించండి
చేతులు చాచి, కళ్లు మూసి, మిమ్మల్ని మీరు
స్వీయ సమాధిలోకి చేర్చుకొని
పురాతన శిథిలాలతో చితిని పేర్చుకొండి
తరువాతి తంతును మన ప్రియతమ జోడీల
చిత్తాలకు, ఉన్మత్తాలకు వదిలి పెట్టండి...
స్వతంత్ర భారతావని ధరించిన నవరత్నాలను
ఒక్కొక్కటిగా వొలిచేస్తూ
భారం తగ్గిస్తున్నామని నమ్మకంగా
నమ్మబలుకుతున్న
నవ నవీన నవనేత చోరకళను
నోరారా కీర్తించండి చప్పట్లు కొట్టండి
కైంకర్యానికి కూడా కమ్మని కతలు వినిపిస్తున్న
నయవంచక శిల్పానికి జేజేలు పలకండి
మీ ఇంట్లో బాజాభజంత్రీలు సిద్ధంగా లేకపోతే
చిప్పలూ, అప్పులతోనైనా ఘనంగా వాయించండి
మీ దెబ్బకు మీ చెవులే మొద్దుబారేలా
యుద్ధ రావాలు మోగించండి!

సంభావన పారవశ్యంతో,
అమితానందపు అజ్ఞానంతో
కళ్లు బైర్లు కమ్మే స్వాహా సందోహాన్ని వీక్షించండి
అహో ఓహో అని పరవశించండి
మన గజ దొంగ జగత్ కిలాడీగా
అవతరించినందుకు
ఆనందించండి అర్చనలు జరిపించండి
మోషాల నిషాపర్వంలో
మొత్తం హరించుకుపోయేదాకా
ఎవరు కూర్చున్న కొమ్మను వాళ్లే
తెగ ఉత్సాహంగా తెగ నరుక్కొండి!

వాడికి వీడు వీడికి వాడు
సంబరంగా ఆదాన ప్రదానాలు చేసుకుంటున్నారు
అంతరాయం కలిగించకండి
ప్రశాంత ఏకాంత మోషాంతాల సేవకి
వీలైతే ఒక కొత్త భజన పాట కూర్చండి
"మా గజదొంగ మాకు గర్వ కారణం
మా దేశ సర్వ సంపదా వాడికి సమర్పణం" అని
కొత్త ప్రతిజ్ఞ జోడించండి!
అంధభక్తి వర్ధిల్లినంత కాలమూ
అంతా దొంగల స్వాహామ్యమని అఘోరించండి!

**– సత్యాజీ**

"పర్యావరణ, ఆర్థిక జవాబుదారీతనం యొక్క అవసరాన్ని అదానీ స్కామ్ పూర్తిగా గుర్తుచేస్తుంది. అధికారంలో ఉన్నవారి నుండి మరింత పారదర్శకతను డిమాండ్ చేయాలి."

**– లియోనార్డో డికాప్రియో**

"వ్యాపారం, ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారీతనం యొక్క ఆవశ్యకతకు అదాని స్కామ్ ఒక అద్భుతమైన ఉదాహరణ. అధికారంలో ఉన్న వారి నుండి మరింత జవాబుదారీతనం డిమాండ్ చేయాలి."

**– ఎలన్ మస్క్**

## వైఫల్యానికి నిదర్శనం

(మొదటిపేజీ తరువాయి)

ఫాక్టర్‌తో వీటిని నడపాలి. ఉత్పత్తి జరిగే స్థలం నుంచి వివిధ ప్రాంతాలకు విద్యుత్తును పంపిణీ చేసే క్రమంలో చాలా విద్యుత్తును నష్టపోవలసివస్తుంది. ఈ నష్టం అంతా వినియోదారులే భరించాల్సివస్తుంది. లదే వినియోగ దారుల గృహాలమీద గనుక సౌరవిద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే వారే తిరిగి విద్యుత్ గ్రిడ్ కు అమ్ముకునే వీలుంటుంది. దాని వలన వారిమీద పడే భారం తగ్గుతుంది. గత దశాబ్ద కాలంలో కార్పొరేట్ సౌర విద్యుత్ ప్లాంట్ల వ్యవహారాన్ని గనుక సమీక్షిస్తే వీటిని ఏర్పాటు చేయడం వెనుక ఎంత పెద్ద స్థాయిలో రాజకీయ అవినీతి చోటు చేసుకుందో స్పష్టంగా కనపడుతుంది. 2022 ఎలక్ట్రిసిటీ(సవరణ) చట్టం 2022 లో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ "రెన్యుబుల్ ఎనర్జీ ఆబ్లిగేషన్" పేరుతో ఒక క్లాజ్ ను చేర్చడానికి ప్రయత్నించింది. దాని ప్రకారం వినియోదారులమీద ఏటికేడాదీ చార్జీలు పెరిగే విధానం అమలౌతుంది. వినియోదారులకు అది ఊహకందనంత పెనుభారం అవుతుంది. వినియోగదారులను బలిపెట్టి కార్పొరేట్లకు సేవ చేయడమే కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఏకైక లక్ష్యం లా కనిపిస్తోంది. (జాతీయ స్థాయిలో జరిగిన చరిత్రాత్మక రైతుల పోరాటం వలన ఈ సవరణ చట్టం రద్దు అయింది)

### రెండు వైపులా వడ్డింపు

2. విద్యుత్ మంత్రిత్వ శాఖతో బాటే కూడబలుక్కున్నట్టు ఎంఎన్ఆర్ఇ (మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ ) అదానీ గ్రీన్, ఎజ్యూర్ తదితర కార్పొరేట్ కంపెనీలకు, అవి లాభాలార్జిస్తున్నప్పటికీ, విచ్చలవిడిగా సబ్సిడీల పేరుతో ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఇందుకోసం ప్రత్యేకించి స్కీములు రూపొందించింది. ఆ స్కీముల్లో వినియోదారులు భరించలిగే విధంగా చార్జీలు ఉండాలన్న నిబంధనలు ఏవీ లేవు. ఈ మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్లను బట్టి చూస్తే అదానీ సంస్థకు రు.863 కోట్లు, ఎజ్యూర్ కు రు.186 కోట్లు చెల్లించినట్టు ఉంది. ఈ సొమ్మంతా బడ్జెట్ నుంచే కేటాయించారు. అంటే టాక్స్ పేయర్ల సొమ్ము ఇది. మరోవిధంగా చెప్పాలంటే, టాక్స్ పేయర్ల సొమ్మును సబ్సిడీల రూపంలో మళ్ళిస్తున్నారు. ఇంకోవైపు వినియోదారులుగా అదే టాక్స్ పేయర్లు ఎక్కువ ఖరీదు చెల్లించి విద్యుత్తు కొనుగోలు చేయవలసివస్తోంది. అంటే రెండు వైపులా వడ్డింపు అన్నమాట. కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి జవాబుదారీ తనమూ ఉన్నట్టు కనిపించడంలేదు.

3. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పడిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఇ సిఐ–సెకి) ఇదే కార్పొరేట్లనుంచి విద్యుత్తును ఎక్కువ ఖరీదుకు కొనుగోలు చేసి బలవంతంగా రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలకు అంటగట్టే బ్రోకర్ గా తయారైంది. ఈ క్రమంలో కొన్ని రాష్ట్రాల్లో రాజకీయ నాయకులు కొందరు ఆ కార్పొరేట్లతో లాలూచీ పడి ఖరీదైన విద్యుత్తును కొని వినియోదారులమీద ఆ భారాన్నంతటినీ రుద్దే విధంఆ ఒప్పందాలు చేసుకోడానికి అవకాశం ఏర్పడింది.

### చర్యలు ఏవీ!

4. వినియోగదారుల ప్రయోజనాలను రక్షించడం కోసం ఏర్పడిన కేంద్ర, రాష్ట్రాల ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీస్ అధికధరలకు విద్యుత్తును కొనుగోలు చేయడానికి ఒప్పందాలు చేసుకున్న రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలమీద ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. కార్పొరేట్లు వినియోదారులను కొల్లగొడుతూంటే ఈ సంస్థలు మౌన ప్రేక్షకులుగా ఉండిపోయాయి.

5. అమెరికన్ దర్యాప్తు సంస్థలు, అక్కడి ఎస్ఇసి, అదానీ గ్రూపు సంస్థలమీ దర్యాప్తు చేపట్టినట్టు వార్తలు ఏడాది క్రితమే వార్తలు వచ్చాయి. మీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడిచే సెబి గనుక స్పందించివుంటే, మన దేశీయ స్టాక్ మార్కెట్ లోని మదుపుదారుల ప్రయోజనాలను పరిరక్షించే ఆలోచనే ఉంటే, వెంటనే అమెరికాలోని ఎస్ఇసి ని సంప్రదించివుండాలి. ఆ వెంటనే ఇక్కడ కూడా తగు చర్యలు తీసుకుని వుండాలి. ఈ విషయం లో అదానీ సంస్థ కాని, ఎజ్యూర్ కాని సెబి ముందు వాస్తవాలు వెల్లడించారా? చట్టప్రకారం ఆ విధంగా చేయవలసిన బాధ్యత ఆ కంపెనీలకు ఉంది. ఇదేదీ జరగలేదు. అంటే సెబి మదుపుదారుల ప్రయెజనాల రక్షణ విషయంలో తన బాధ్యతను ఉల్లంఘించినట్టు కాదా? ఈ ముఖ్యమైన ప్రశ్నలకు సెబి సమాధానాలు చెప్పాల్సిందే.

### అదానిపై నియంత్రణ లేదా?

6. సెబి చైర్‌పర్సన్ కు అదానీ గ్రూప్ తో పరోక్షంగా లింకులు ఉన్నాయన్న ఆరోపణలు వెల్లడయ్యాయి. కాని ఆమె తనకు తానే ఏదోషమూ లేదన్న సర్టిఫికెట్ ఇచ్చుకున్నారు. సెబి నిబంధనల ప్రకారం పదవుల్లో ఉన్నవారి వ్యక్తిగత ప్రయోజనాలు సెబి విశాల ప్రయోజనాలకు భిన్నంగా ఉండే సందర్భాల్లో పాటించవలసిన విధానాలను విస్మరించారు. మీరు, మీ సహచరులు శిలావిగ్రహాలమాదిరిగా నిశ్చేష్టంగా ఉన్నారు. ఒక నియంత్రణ సంస్థగా సెబి ప్రతిష్ట మీద ఆధారపడి దేశీయ స్టాక్ మార్కెట్ పట్ల ప్రజల విశ్వాసం ఉంటుందన్న వాస్తవాన్ని కూడా విస్మరించారు. సెబి అందరిపైనా నియంత్రణ చలాయిస్తోంది కాని అదానీ గ్రూపు వరకు, తనవరకు వచ్చేసరికి ఆ నియంత్రణ ఏదీ లేకపోవడం విస్మయం కలిగిస్తుంది. నేను గతంలో కూడా పలుమార్లు ఈ విషయం మీద లేఖలు రాసినా, మీరు ఎటువంటి చర్యలూ తీసుకోనేలేదు.

7. అదాని గ్రూపు కు సంబంధించి మరికొన్ని దర్యాప్తుల ప్రతిపాదనలు కూడా సెబి ముందు ఉన్నాయి. కాని ఇంతవరకూ అవేవీ వెలుగు చూడనేలేదు. సెబి ని ఏదైనా అదృశ్య హస్తం ప్రభావితం చేస్తోందా?

### దర్యాప్తు సంస్థల ప్రేక్షక పాత్ర

8. ప్రతిపక్ష పార్టీలలోని రాజకీయ నాయకుల విషయంలో క్షణాలమీద సిబిఐ, ఇడి, డిఆర్ఐ, ఇన్‌కంటాక్స్ అధికారులు రంలోకి దిగిపోతున్నారు. కాని, అదానీ విషయంలో మాత్రం ఏడాది క్రితమే వార్తలు వెలువడ్డా ఇంతవరకూ ఆ దర్యాప్తు సంస్థల ఉలుకూ లేదు, పలుకూ లేదు. అదాని గ్రూపు బొగ్గు, విద్యుత్ ఉత్పత్తి పరికరాల ధరలను కృత్రిమంగా పెంచి చూపిన విషయమై దర్యాప్తు కొనసాగుతోంది. అదే విధంగా సోలార్ పానెల్స్ కొనుగోలు ధరలను. సౌరవిద్యుత్తు కొనుగోలు ఒప్పందాలలో అధిక ధరలను చూపించిన విషయాల్లో కూడా దర్యాప్తు మొదలైంది. కాని ఈ దర్యాప్తులన్నీ ముందడుగు పడకుండా వెనక్కి పోయాయి.

9. భారతదేశంలో విద్యుత్ వినియోదారులు అనేక విధాలుగా మోసగించబడుతున్నారు. కేంద్ర బొగ్గు, రైల్వే మంత్రిత్వ శాఖలు కూడబలుక్కుని కృత్రిమంఆ దేశ వ్యాప్తంగా బొగ్గు కొరతను గత కొన్ని సంవత్సరాలుగా సృష్టించడం కూడా వాటిలో ఒకటి. ఆ వెంటనే ఇంధన మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగి తనకు అధికారం లేకపోయినా, సెక్షన్ 11 ప్రకారం రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలకు ఆదేశాలను జారీ చేసింది. వాటి ప్రకారం రాష్ట్ర విద్యుత్ సంస్థలు బొగ్గు కొరతను పూడ్చడానికి బొగ్గు దిగుమతి చేసుకోవాలి. ఆ విదేశీ కంపెనీల యజమానులు దేశీయ కార్పొరేట్లే నన్న సంగతి ఇంధన శాఖ కు బాగా తెలుసు. విదేశీ కంపెనీలు చుక్కలనంటే ధరలకు బొగ్గును రాష్ట్ర సంస్థలకు అమ్ముతున్నాయి. ఆ భారం మళ్ళీ వినియోదారులపైనే భారీగా పడుతోంది. ఇదంతా ఒక లోతైన పథకం ప్రకారం కేంద్ర, రాష్ట్రాల రాజకీయ నాయకుల పాత్రతో సాగుతున్న కుంభకోణం. బొగ్గు కొరత కొనసాగుతూనేవుంది. కుంభకోణం కూడా సాగుతూనేవుంది. ఈ మహా మోసంలో ఏమీ తెలియని వినియోగదారులు మాత్రం మోసపోతూనేవున్నారు.


ఈ నేపథ్యంలో ప్రస్తుతం గౌతమ్ అదాని అభేద్యమైన ఒక కోటలోపల ఉన్నవాడిలా భద్రంగా రక్షింపబడుతూవున్నాడని నాకనిపిస్తోంది. ప్రజా ప్రయోజనాలను, జాతీయ ప్రయోజనాలను కాపాడవలసిన కేంద్ర ప్రభుత్వం, వివిధ సంస్థలు ఆ బాధ్యతను విస్మరించి, అదాని సామ్రాజ్యాన్ని బహు జాగ్రత్తగా కాపలా కాస్తున్నాయి. అధికార రాజకీయ పార్టీ పల్లకీ మోసేవారు, దాని భట్రాజులు అదాని గ్రూపు చేస్తున మోసాలను సమర్థిస్తూ, అదేదో కొన్ని ప్రతిపక్ష రాష్ట్రాలకు పరిమితమైన కుంభకోణంగా చిత్రిస్తున్నారు. అందులో కేంద్రానికి ఎటువంటి పాత్రా లేదన్నట్టు మాట్లాడుతున్నారు. అదానీ గ్రూపు భారతీయ "స్వావలంబన"కు ప్రతీక అయినట్టు, "విదేశాల"నుండి దానికి సవాలు ఎదురైతే అదేదో మన దేశ స్వావలంబనకే ముప్పు అన్నట్టు అభివర్ణిస్తూ ఈ కుంభకోణానికి "దేశభక్తి" రంగు పులుముతున్నారు. తద్వారా వాస్తవాలను మసకబరచి ప్రజానీకాన్ని తప్పు దోవ పట్టిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం లో ప్రధాన స్థానాల్లో ఉన్నవారు ఎప్పుడు విదేశాల్లో పర్యటించినా, ఈ బడా కార్పొరేట్ సంస్థలనే మన దేశ వ్యాపార, పారిశ్రామిక శక్తి అన్నట్టు చూపిస్తున్నారు. అందుచేత ఆ బడా సంస్థలు ఏ విధమైన తప్పుడు పద్ధతులను అనుసరించినా దాని ఫలితంగా దెబ్బ తినేది మన దేశ ప్రతిష్టే. అంతర్జాతీయంగా మన పరువు ప్రతిష్టలు నిలబడాలంటే ఈ కుంభకోణం మీద దర్యాప్తు ఎంత తొందరగా ఆదేశిస్తే అంత మంచిది.

బడా కార్పొరేట్ సంస్థలు బాగా పని చేయగలుగుతున్నాయా అన్నది ప్రభుత్వ సమర్థతకు ఋజుత్వం కాబోదు. ఏ మేరకు చట్టబద్ధంగా పాలన సాగింది, ఏ మేరకు ప్రజా ప్రయోజనాలను రక్షించగలిగారు అన్న దానిని బట్టి సుపరిపాలన అనేది నిర్ధారించబడుతుంది.

సెబి మీద ఇటీవల వచ్చిన ఆరోపణల విషయంలో గాని ఇతర ఆరోపణలమీద గాని కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖ ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. దీని తర్వాత ఒకవేళ ఇప్పుడు తీరుబడిగా ఈ విషయంలో మీ మంత్రిత్వ శాఖ విచారణ మొదలుపెట్టినా దానికి ఏ విశ్వసనీయతా ఉండబోదు.

అదాని గ్రూపు మీద అమెరికన్ కోర్టు చేసిన ఆరోపణలు ప్రజల దృష్టికి వచ్చిన మరుక్షణమే మా "పీపుల్స్ కమిషన్ ఆన్ పబ్లిక్ సెక్టర్ అండ్ పబ్లిక్ సర్వీసెస్" ( పిసిపిఎస్‌పిఎస్) కు చెందిన మాలో కొంతమంది ఒక ప్రకటన జారీ చేశాం. అందులో ఈ విధంగా డిమాండ్ చేశాం:




### సమగ్ర విచారణ జరిపించండి

ఒక స్వతంత్ర న్యాయ వ్యవస్థ పర్యవేక్షణలో అదాని వ్యవహారం మీద సిబిఐ, ఇడి, డిఆర్ఐ, సిబిడిటి వంటి దర్యాప్తు సంస్థలతో సమగ్రమైన విచారణ చేపట్టాలి. దేశీయంగాను, విదేశాలలోను సేకరించిన సాక్ష్యాల ఆధారంగా ఈ విచారణ జరగాలి. ఇంధన మంత్రిత్వ శాఖ ప్రజలకు నష్టం, బడా కార్పొరేట్లకు అనుకూలం అయిన ఇటువంటి విధానాలను ఏ పరిస్థితుల్లో చేపట్టాయన్నది, రాష్ట్రాల విద్యుత్ సంస్థలకు చట్టవిరుద్ధంగా ఏ విధంగా ఆదేశాలను జారీ చేశాయన్నది ఆ విచారణలో భాగంగా ఉండాలి. అవినీతి, మోసాలు వీటి కారణంగానే సాధ్యం అయ్యాయి. ఆ విచారణలో విద్యుత్ వినియోగదారులమీద ఈ అవినీతి, మోసాల కారణంగా ఎంత భారం పడిందో ఆ మొత్తాన్ని నిర్ధారించాలి. ఏవిధంగా వినియోగదారులకు పరిహారం చెల్లించాలో తేల్చాలి. ఇటువంటి కుంభకోణాలు భవిష్యత్తులో జరగకుండా ఉండేందుకు ఎటువంటి శిక్షలు, అపరాధ రుసుములు విధించాలో నిర్ణయించాలి. అంతేగాక, ఈ కుంభకోణంలో కేంద్ర మంత్రులు, సెబి తదితర సంస్థలు పోషించిన పాత్ర ఏమిటో తేల్చాలి. అటువంటివి భవిష్యత్తులో జరిగేవీలు లేకుండా ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు, దిద్దుబాట్లు చేపట్టాలో తేల్చాలి.

ఆ విచారణ కమిషన్ నివేదికను ఆరు మాసాలలోఆ పార్లమెంటుముందు ప్రవేశపెట్టాలి.

మా కమిషన్ అభిప్రాయాలను, ఆందోళనను కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖ పట్టించుకోకుండా ఉంటే పర్యవసానాలు తీవ్రంగా మారుతాయని నా అభిప్రాయం. మొండిగా అదానీ గ్రూపును సమర్థిస్తూ, సెబి పోషించిన పాత్రను బలపరుస్తూవుంటే ఈ ప్రభుత్వం మీద ప్రజలు ఉంచిన నమ్మకం మరింతగా దిజారిపోతుంది.

పైన వివరించిన విషయాలు చాలా తీవ్రమైన ప్రభావం కలిగించేవి. వాటిమీద ప్రజల్లో చర్చలు పెద్దఎత్తున జరగాలని భావిస్తున్నాను.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కు కూడా ఈ లేఖ ప్రతిని పంపుతున్నాను. పై లేఖలో వ్యక్తం అయిన అంశాలమీద వారు సమగ్రంగా ఆడిట్ నిర్వహించాలని ఆశిస్తున్నాను. ప్రజలమధ్య చర్చలు జరిగేందుకు వీలుగా ఈ లేఖను బహిరంగంగా విడుదల చేస్తున్నాను.

## కలవరపెడుతోంది

### బాలీవుడ్ సెలబ్రిటీలు




అదాని కుంభకోణం యొక్క పరిమాణం కలవరపెడుతోంది. న్యాయం జరుగుతుందని, బాధ్యులు జవాబుదారీగా ఉంటారని ఆశిస్తున్నాను.

**– రణవీర్ సింగ్**



బాధ్యత గల పౌరురాలుగా, అదాని స్కామ్‌తో నేను దిగ్భ్రాంతికి గురయ్యాను. అటువంటి మోసాలను నిరోధించడానికి బలమైన నిబంధనలు, పర్యవేక్షణ అవసరం.


**– ప్రియాంక చోప్రా**



అదాని కుంభకోణం మనందరికీ మేల్కొలుపు. మనం అధికారంలో ఉన్నవారి నుండి మరింత పారదర్శకత, జవాబుదారీ తనం డిమాండ్ చేయాలి.

**– షారూఖ్ ఖాన్**

## దిగ్భ్రాంతికరం : క్రికెటర్లు



అదాని స్కామ్‌తో దిగ్భ్రాంతికి గురయ్యాను. ఒక సెలబ్రిటీగా, ఆర్థిక అక్షరాస్యత, పారదర్శకతను ప్రోత్సహిం చడం అవసరమని నేను నమ్ముతున్నాను.

**– విరాట్ కోహ్లి**



అదాని కుంభకోణం మనం అప్రమత్తంగా ఉండాలని, అధికారంలో ఉన్నవారి నుండి మరింత డిమాండ్ చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేస్తుంది. న్యాయం జరుగుతుందని ఆశిద్దాం.

**– రోహిత్ శర్మ**



బాధ్యత కలిగిన పౌరుడిగా, అదాని స్కామ్‌తో నేను నిరాశకు గురయ్యాను. మనం పారదర్శకత, జవాబుదారీ సంస్కృతిని ప్రోత్సహించాలి.

**– సచిన్ టెండూల్కర్**

## అవినీతి చీకటి

అవినీతి, చీకటి మూసివేసే మార్గం
దేశాలను ద్రోహపూరితంగా నడిపిస్తుంది
ప్లేగు, క్యాన్సర్‌లా పెరుగుతూ
విస్తరిస్తోంది
స్వాతంత్య్రం పోయే కొద్దీ నమ్మకం
సన్నగిల్లుతోంది

అధికార మందిరాల్లో దురాశ
పట్టుకుంది
అవినీతిపరులు, మోసగాళ్ల రాజ్యంలో..
నిధులు మేసేస్తూ పెద్దలు గద్దలతో
స్నేహం..
వాటి గూళ్ళను చేరుతూ..
న్యాయం కుంటుపడుతుంది
పేదరికం ఆకలితో అలమటిస్తోంది

కానీ ఇప్పటికీ మేము
ప్రకాశవంతమైన రోజు కోసం
ఆశిస్తున్నాం
చిత్తశుద్ధి, నిజాయితీ ఉన్నప్పుడు
నేతలు కల్మషం లేని హృదయాలతో
సేవ చేసినప్పుడు
అవినీతి పట్టు ఎట్టకేలకు
సడలిపోతుంది

– శాంతిశ్రీ

## అదాని అవినీతి బాగోతం

ధ్వారాలన్నీ తెరిచే ఉన్నాయి
పాలకులు పాలికాపులైన వేళ
అవినీతి అనకొండలే
రాజ్యమేలుతాయ్...

ఇప్పుడు. ఎప్పుడు జరిగేది అదే
బోఫోర్స్ అవినీతి బోర్డర్ దాటితే
అదానీ అవినీతి ఎల్లలు దాటింది

బహుశా ఒలింపిక్స్‌లో వెనుకబడ్డ
భారత దేశాన్ని అవినీతిలో విశ్వవిజేతగా
నిలబెట్టాడు అదానీ

నమో కాలికింద దేశభక్తి నలిగి
సంపన్నుల అమ్ములపొదిలో
అవినీతి ఆయుధమై ఎగిసింది

డాలర్ డేగలు ఎప్పుడో
భారత భూమిని బుక్కేసాయి
పచ్చని పశుపుకొమ్ము, వేపచెట్టునీ
పేటెంటు భూతం మింగేసింది...

ఇప్పుడు ఇండియా ముఖచిత్రం
అవినీతి అనకొండ అదానీ రూపమై
విపణి వీధిలో పతంగమై
ఎగురుతుంది.. నమో పాలనలో

దేశభక్తులారా...రండీ... ఒక్కొక్కరూ
రండీ
రూపాలు మార్చుకుని రండి...
రైతు ఉద్యమాన్ని గుర్తుకుతెచ్చుకుని
అవినీతి రాబంధులను మట్టు
పెట్టేందుకు
గుండెను రాయి చేసుకుని రాజ్యంతో
తలపడదాం... రంగ్ దే భారత్ అని
నినదిద్దాం....

– రెడ్డి శంకరరావు
9494333511

# మోడీ వెంటే అదాని

**పొగడదొరువు**

'ప్రధానమంత్రి నరేంద్రమోడీ వెళ్లిన ప్రతి దేశానికి అదాని తప్పకుండా వెళ్తారు' ఇది ఇప్పటి మాట కాదు. 2015లోనే ఒక జాతీయపత్రిక ఈ విషయాన్ని ప్రముఖంగా ప్రచురించింది. అయితే, ఈ పర్యటనలు దేశానికి ఎంత వరకు ఉపయోగపడ్డాయన్నదే ప్రశ్న! సమాధానమేమిటంటే, దేశానికన్నా అదాని వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకోడానికి, గుత్తాధిపత్యాన్ని నెలకొల్పడానికే ఇవి ఎక్కువగా ఉపయోగపడ్డాయి.

కెన్యా అధ్యక్షుడు, డిసెంబర్ 2023లో న్యూఢిల్లీని సందర్శించారు. మూడు నెలల తర్వాత, మార్చిలో, అదానీ గ్రూపు నైరోబీ విమానాశ్రయాన్ని అప్‌గ్రేడ్ చేయడానికి ప్రతిపాదనను సమర్పించింది. జూన్‌లో, కెన్యా అధికారులు అప్పటి వరకు ఉన్న జాతీయ విమానయాన విధానాన్ని మార్చారు. అవినీతికి వ్యతిరేక పోరాట కార్యకర్త (విజిల్ బ్లోయర్) ఒకరు ఈ ఒప్పందానికి సంబంధించి వెలుగులోకి తెచ్చారు. దీంతో కెన్యా మానవ హక్కుల కమిషన్, బార్ అసోసియేషన్‌లు ఈ ఒప్పందాన్ని సవాల్‌చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. 'వ్యూహాత్మక, లాభదాయకమైన జాతీయ విమానాశ్రయాన్ని ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇవ్వడం అహేతుకం' అని ఆ సంస్థలు వాదించాయి. ఎటువంటి పోటీ బిడ్డింగ్ లేకుండా ఈ వ్యవహారం రహస్యంగా జరుగుతున్నట్లు అవి నిరూపించాయి. మరోవైపు ప్రజలు కూడా ఆందోళనలకు దిగారు. దీంతో ఆ ఒప్పందాన్ని అక్కడి హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. కెన్యా పార్లమెంటులో ఈ విషయమై నిలదీయడంతో అక్కడి ప్రభుత్వ సలహాదారు అదానికి విమానాశ్రయం కోసం ఎటువంటి కాంట్రాక్టు ఇవ్వలేదని, అయితే, అధిక వోల్టేజి విద్యుత్ లైను నిర్మించేందుకు 1.3 బిలియన్ డాలర్ల విలువైన రాయితీలు మాత్రం ఇచ్చినట్లు ప్రకటించారు.


**బంగ్లాదేశ్‌లో...**

వివాదాస్పదంగా మారిన బంగ్లాదేశ్ ఒప్పందం కూడా మోడీ దౌత్యపరమైన చర్యల్లో భాగంగానే కుదిరింది. 2015 జూన్‌లో ప్రధానమంత్రిగా ఢాకాకు మోడీ తన మొదటి పర్యటన చేశారు. ఈ సందర్భంగా, బంగ్లాదేశ్‌కు విద్యుత్ అవసరాలను తీర్చడంలో భారతదేశం ప్రధాన భాగస్వామి అవుతుందని ఆయన చెప్పారు. ఈ పర్యటన ముగిసిన రెండు నెలల తర్వాత, జార్ఖండ్ నుండి విద్యుత్ ఎగుమతి కోసం అదానీ గ్రూపుతో బంగ్లాదేశ్ అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. దీనిలో భారీ అవినీతి ఉందని కొన్ని సంవత్సరాలుగా బంగ్లాదేశ్‌లో ప్రతిపక్షాలు ఆందోళనలు చేస్తున్నాయి. అయితే, హసీనా ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదు. ప్రజా తిరుగుబాటుతో అధికారం చేతులు మారడంతో ఆ ఒప్పందాన్ని సమీక్షించాలని అక్కడి తాత్కాలిక ప్రభుత్వం నిర్ణయించింది.

**శ్రీలంకలో...**

బంగ్లాదేశ్‌లో మాత్రమే అదానీ ప్రాజెక్టులను వివాదాలు ముంచెత్తలేదు. అనేక దక్షిణాసియా దేశాల్లో ఇదే స్థితి. శ్రీలంకలో ఎలక్ట్రిసిటీ బోర్డు అధికారి ఒకరు ఆ దేశ పార్లమెంటరీ కమిటీకి అదానీ గ్రూప్‌నకు పవన విద్యుత్ ప్రాజెక్టును అప్పగించాలని మోడీ ఒత్తిడి తెస్తున్నట్లు దేశాధ్యక్షుడు గొటబయ రాజపక్సే తనతో చెప్పారని తెలిపారు. 2021 నవంబర్‌లో గ్లాస్గోలో జరుగుతున్న వాతావరణ మార్పుల సదస్సులో భాగంగా మోడీని రాజపక్సే కలుసుకున్న కొద్ది రోజుల తర్వాత ఇది జరిగింది. ఈ ప్రకటన శ్రీలంకలో కలకలం రేపింది. దీంతో ఆ అధికారి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవడంతోపాటు, పదవికి రాజీనామా చేశారు. అంతకుముందు, ఫిబ్రవరి 2020లో, ప్రధాని మహింద రాజపక్స ఢిల్లీలో మోడీని కలుసుకున్నారు 'ఆర్థికంగా ముఖ్యమైన విషయాల' గురించి చర్చించినట్లు ఆయన ప్రకటించారు..






**నేపాల్‌లో ...**

ఈ ఏడాది నేపాల్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయాలను స్వాధీనం చేసుకునేందుకు అదానీ గ్రూప్ అక్కడి అధికారులతో చర్చలు జరుపుతోంది. చైనా నుండి రుణం తీసుకుని నిర్మించిన పోఖారా మరియు భైరహవాలోని రెండు కొత్త విమానాశ్రయాలు నేపాల్‌కు ఆర్థికంగా లాభసాటిగా లేవు. జెట్ విమానాల రాకపోకల కోసం ఎత్తైన మార్గాలను మన దేశం తెరవకపోవడం దీనికి కారణం, జూన్ 2023లో జరిగిన సమావేశంలో నేపాల్ ప్రధాని మోడీతో ఈ సమస్యను లేవనెత్తారు, ఆ తర్వాత అదానీ గ్రూప్ అధికారులు ఖాట్మండును సందర్శించి నేపాల్ పౌర విమానయాన అధికారులతో వాటిని స్వాధీనం చేసుకునే విషయమై చర్చలు జరిపారు.

**టాంజానియా నుండి వియత్నాం వరకు....**

2017 మార్చిలో మలేషియా ప్రధాన మంత్రి నజీబ్ తున్ రజాక్‌కు న్యూఢిల్లీలో మోడీ ఆతిథ్యం ఇచ్చారు. ఈ భేటీ జరిగిన ఒక నెల తర్వాత, అదానీ గ్రూపు కారీ ద్వీపంలో మెగా కంటైనర్ పోర్ట్ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయడానికి మలేషియా మౌలిక సదుపాయాల సంస్థతో ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది.2018 జూన్‌లో మోడీ సింగపూర్‌కు వెళ్లి అక్కడ ప్రధాని లీ సీన్ లూంగ్‌ను కలిశారు. ఒక నెల తరువాత, సింగపూర్ ప్రభుత్వ యాజమాన్యంలోని పెట్టుబడి సంస్థ టెమాసెక్ అదానీ పోర్ట్‌లలో రూ.1,000 కోట్లు పెట్టుబడి పెట్టింది.

అక్టోబర్ 2023లో టాంజానియా ప్రెసిడెంట్ సమీహా సులుహుకు ఢిల్లీలో మోడీ ఆతిథ్యం ఇచ్చారు. ఎనిమిది నెలల తర్వాత, మే 2024లో అదానీ గ్రూపు దార్ ఎస్ సలామ్ పోర్ట్‌లో కంటైనర్ టెర్మినల్‌ను నిర్వహించడానికి 30 సంవత్సరాల రాయితీ ఒప్పందాన్ని పొందింది. టెర్మినల్ సేవలను అందించే ఎడి పోర్ట్సు గ్రూపు కంపెనీలో 95% వాటాను కొనుగోలు చేయడానికి అబుదాబితో జాయింట్ వెంచర్‌ను కూడా కుదుర్చుకుంది.

. వియత్నాం ప్రధాన మంత్రి ఫామ్ మిన్ చిన్ 2024 జూలై–ఆగస్టులో ఢిల్లీకి వచ్చారు. మోడీని కలిసిన అదే రోజు, గౌతమ్ అదానీని కూడా ఆయన కలిశారు. ఈ భేటీ తరువాత అదానీ గ్రూపు వియత్నాంలోని రెండు విమానాశ్రయాలలో పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఓడరేవును నిర్మించే ప్రణాళికలు ఆమోదం దిశలో ఉన్నట్లు తెలిపింది,

. జూలై 2017లో ఇజ్రాయిల్‌ను నరేంద్రమోడీ సందర్శించారు. ఆ దేశాన్ని సందర్శించిన మొదటి భారత ప్రధానిగా ఆయన గుర్తింపుపొందారు. ఆ తర్వాత అదానీ గ్రూప్ ఇజ్రాయిల్‌తో గణనీయమైన వ్యాపార సంబంధాలను ఏర్పరచుకుంది. జనవరి 2018లో ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు మోడీ ఢిల్లీలో ఆతిథ్యం ఇచ్చారు. అదే సంవత్సరం డిసెంబర్‌లో, అదానీ గ్రూప్ ఇజ్రాయిల్ సంస్థ ఎల్బిట్ సిస్టమ్స్‌తో కలిసి మిలటరీ అవసరాల కోసం డ్రోన్‌లను తయారు చేసే యూనిట్‌ను తెలంగాణలో ప్రారంభించింది. 2022లో, అదానీ గ్రూప్ ఇజ్రాయిల్‌లోని హైఫా పోర్టును కొనుగోలు చేసింది.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదాహరణలు. నరేంద్రమోడీతో పాటు అదాని గ్రూపు అధినేత గౌతమ్ అదాని కూడా గుజరాత్‌కు చెందిన వారే అన్నది అందరికీ తెలిసిన విషయమే. వారిద్దరి మధ్య ఉన్న సన్నిహిత సంబంధాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 2014లో మోడీ ప్రధాని అయిన తరువాత అదాని గ్రూపు వ్యాపార సామ్రాజ్యం అనూహ్యంగా పెరిగింది. వివిధ రంగాలకు విస్తరించింది. మన దేశంలో విమానాశ్రయాలు, ఓడరేవులు, బొగ్గుగనులు, విద్యుత్, గ్యాస్ రంగాల్లో అతి పెద్ద ప్రైవేటు యాజమాన్య సంస్థగా విస్తరించింది. ఈ పరిణామం మోడీ ప్రభుత్వం అనుసరించిన ఆశ్రిత పెట్టుబడిదారి విధానం (క్రోని క్యాపిటలిజం)కు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. గత ఏడాది విడుదలైన హిండెన్‌బర్గ్ నివేదిక అదాని అక్రమాలను వెలుగులోకి తెచ్చింది. ఆ నివేదిక వెలువడిన తరువాత స్విస్ అధికారులు తైవాన్ నివాసి ఒకరిని అదాని తరుపున మనీ లాండరింగ్‌కు పాల్పడుతున్నారంటూ ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అమెరికన్ కోర్టు చొరవతో తాజాగా మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

(స్క్రోల్ ఆధారంగా)

## వ్యాపార సామ్రాజ్య విస్తరణ ఇలా..

**1978 :** దేశ ఆర్థిక రాజధాని ముంబైలో డైమండ్ సార్టర్‌గా వృత్తి ప్రారంభం, ఆ తరువాత కొన్ని సంవత్సరాలు సోదరుడు మహాసుఖ్‌భాయ్ అదానికి ప్లాస్టిక్ తయారీ వ్యాపారంలో సహకారం

**1988 :** అదాని ఎక్స్‌పోర్టు పేరుతో కమోడిటి ట్రేడింగ్ వ్యాపారం ప్రారంభం. త్వరలోనే ఎగుమతులు, దిగుమతులకు వ్యాపార విస్తరణ. ఆ సమయంలో ఆ సంస్థ టర్నోవర్ రెండు కోట్ల రూపాయలు.

**1994 :** అదాని ఎంటర్‌ప్రైజెస్ స్థాపన. ముంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదు. ఆహార సంస్థ కార్గిల్‌తో కలిసి ముంద్రా నుండి ఉప్పును ఎగుమతి చేయడానికి గుజరాత్ ప్రభుత్వంతో జాయింట్ వెంచర్ ఒప్పందం. కార్గిల్ ఆ ఒప్పందం నుండి తప్పుకున్న తరువాత కూడా అదాని సంస్థ కొనసాగింది. ఆ సమయంలో కంపెనీ టర్నోవర్ 150 కోట్ల రూపాయలు.

**1998 :** ముంద్రా పోర్టులో అదాని చేతికి కొన్ని ఓడరేవులు లభ్యం. ఆ రంగంలో అదాని మొదటి అడుగులు ఇవి. దాదాపుగా ఆ సమయంలోనే కేంద్రంలో వాజ్‌పేయి నేతృత్వంలోని మొదటి బిజెపి ప్రభుత్వం ఏర్పడటం గమనార్హం.

**1999 :** బొగ్గు వ్యాపారానికి విస్తరణ. కంపెనీ టర్నోవర్ 2,853 కోట్ల రూపాయలకు చేరిక

**2000 :** అదాని ఎంటర్‌ప్రైజెస్ భారతదేశంలో అతి పెద్ద ప్రైవేటురంగ వ్యాపార సంస్థగా అవతరణ. అదానికి చెందిన ముంద్రా ఓడరేవుకు దేశంలో అతి పెద్ద ప్రైవేటు ఓడరేవుగా గుర్తింపు.

**2001 :** సహజ వాయువు పంపిణీ వ్యవస్థ పూర్తిగా అదాని చేతుల్లోకి. దేశంలో అతి పెద్ద సహజవాయువు పంపిణీదారుగా అవతరణ.

**2002 :** గుజరాత్‌లో మతోన్మాద హింస చెలరేగిన సంవత్సరం. కాన్ఫెడరేషన్ ఆప్ ఇండియన్ ఇండస్ట్రి (సిఐఐ) కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్తలు పలువురు ముస్లింలపై జరిగిన హింసకు నరేంద్రమోడీని విమర్శించారు. అయితే, గౌతమ్ అదాని మోడీని సమర్థించారు. సిఐఐ కన్నా అధికంగా 'వైబ్రెంట్ గుజరాత్' అంతర్జాతీయ వ్యాపార శిఖరాగ్ర సదస్సును నిర్వహించడంలో మోడీకి సహకరించారు.

**2006 :** దేశపు అతిపెద్ద బొగ్గు దిగుమతిదారుగా అదాని సంస్థ అవతరణ

**2007 :** నరేంద్రమోడీ నేతృత్వంలోని గుజరాత్ ప్రభుత్వం ముంద్రాలో అదానికి 140 చదరపు మైళ్ల భూమిని నామమాత్రపు ధరకు (చ.మీ ఒక్క రూపాయి నుండి 32 రూపాయల వరకు) కేటాయించింది. ఈ ప్రాంతం చుట్టూ ఉన్న భూమిని ప్రత్యేక ఆర్థికజోన్‌గా ప్రకటించింది. కంపెని సులభంగా వృద్ధి చెందడం కోసం పన్నులను కూడా తగ్గించింది.

**2008 :** విదేశాలలో తొలి వాణిజ్య అడుగు. ఇండోనేషియాలో బొగ్గు గని కొనుగోలు

**2009 :** విద్యుత్ రంగంలోకి ప్రవేశం. ఆస్ట్రేలియాలోని గెలీలీ బొగ్గుగని, అబాట్ పాయింట్ పోర్టు స్వాధీనం.

**2012 :** దేశంలోని అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తిదారుల్లో ఒకటిగా గుర్తింపు

## మోడీ ప్రధాని అయిన తరువాత

**2014 :** సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో గౌతమ్ అదానికి చెందిన కార్పొరేట్ జెట్‌లో మోడీ ప్రయాణం. ఎన్నికలలో గెలిచి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయడానికి గుజరాత్ నుండి ఢిల్లీకి అదే విమానంలో వెళ్లిన మోడీ. ఆ సమయానికి అదాని గ్రూపు టర్నోవర్ 75,659 కోట్ల రూపాయలుగా అంచనా!

**నవంబర్ 19, 2014 :** ఆస్ట్రేలియాలోని కార్మైకేల్ మైన్ ప్రాజెక్టు కోసం అదాని గ్రూపునకు ఒక్క బిలియన్ డాలర్ల రుణం ఇవ్వడానికి సిద్ధమైన ఎస్‌బిఐ. దీనిపై వివాదం చెలరేగడంతో వెనక్కి తగ్గినప్పటికీ ఆ తరువాత నుండి కొంత కాలం క్రితం వరకు 21వేల కోట్ల రూపాయల వరకు రుణంగా ఇచ్చింది.

**2015 :** ప్రధానమంత్రిగా కెనడా, ఫ్రాన్స్‌లలో మోడీ మొదటి పర్యటనలలో ఆయనతోపాటు గౌతమి అదాని కూడా ఉన్నారు. ఆ తరువాత వివిధ దేశాల పర్యటనలో ఇదే పద్ధతి కొనసాగింది.

**2015:** పర్యావరణ మంత్రిత్వ శాఖ 2013లో అదానీ గ్రూపునకు ముంద్రాలో వాటర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టును అమలు చేస్తున్నప్పుడు చట్టాలను ఉల్లంఘించినందుకు 200 కోట్ల జరిమానా విధించింది. మోడీ ప్రభుత్వం దీనిని రద్దు చేసింది.

**2017:** బొగ్గు కొరత, విద్యుత్ కొరత నేపథ్యంలో దేశీయ బొగ్గు ధర కంటే పది రెట్లు ఎక్కువ చెల్లించి బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కాంట్రాక్టు అదానీ గ్రూప్‌నకు దక్కింది.

**2019:** విదేశాంగ శాఖ, నీతి ఆయోగ్ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, విమానాశ్రయాలను నడపడంలో ముందస్తు అనుభవం లేని అదానీ గ్రూపునకు ఆరు విమానాశ్రయాలను నిర్వహించడానికి మోడీ ప్రభుత్వం అనుమతించింది. అహ్మదాబాద్, లక్నో, తిరువనంతపురం, మంగళూరు, జైపూర్, గౌహతి విమానాశ్రయాలను అదానికి అప్పగించారు.

**2021:** ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం కార్యకలాపాలను అదానీ గ్రూప్ స్వాధీనం చేసుకుంది.

**ఆగస్ట్ 2022**: అదానీ డేటా నెట్‌వర్క్స్ లిమిటెడ్ స్పెక్ట్రమ్ బ్యాండ్ కోసం బిడ్‌ను గెలుచుకుంది. కంపెనీ తన డేటా సెంటర్‌లు, ఇతర వ్యాపార కార్యకలాపాల కోసం ప్రైవేట్ నెట్‌వర్క్‌ను రూపొందించడానికి ఈ స్పెక్ట్రమ్ బ్యాండ్‌ని ఉపయోగించాలని భావిస్తోంది.

**సెప్టెంబర్ 2022:** అదానీ గ్రూప్ రెండు ప్రధాన సిమెంట్ కంపెనీలను కొనుగోలు చేసింది.

**డిసెంబర్ 2022:** మహారాష్ట్ర ప్రభుత్వం అదానీకి ధారవి రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌ను అప్పగించింది.

నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా ఉన్న రెండు పర్యాయాలలో, అదానీ గ్రూప్ వృద్ధి 4500శాతంగా అంచనా వేస్తున్నారు.


# ఆర్థిక విధానాల దుష్ఫలితమే !

## ఒక వైపు అసమానతలు - మరో వైపు ఆర్థిక నేరగాళ్లు

**వివికె సురేష్**



గత మూడు దశాబ్దాలుగా ప్రభుత్వాలు అనుసరించిన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాల ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా తీవ్రమైన ఆర్థిక అసమానతలకు, అత్యధిక స్థాయి ఉపాధి కొరతకు మన దేశం నిలయమైంది. ఒక వైపు సంపద పెరుగుతున్నప్పటికీ దానిలో అత్యధిక భాగం సంపద కొంత మంది చేతుల్లో మాత్రమే కేంద్రీకృతమైంది. ప్రభుత్వ విధానాలు కోట్లమంది సామాన్యుల కన్నా కొద్దిమంది సంపన్నులకే మేలు చేశాయని స్పష్టమైంది. మానవాభివృద్ధి నివేదిక, ఆక్స్‌ఫామ్ నివేదిక, ఆకలి సూచి, అసమానతల సూచి, సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సి.ఎం.ఐ.ఇ) నివేదికలను పరిశీలిస్తే.... కోట్లాది మంది ప్రజానీకం తీవ్రమైన దుర్భర జీవితాలను గడుపుతున్నారని అర్థమవుతోంది. సుమారు 83 కోట్ల మందికి ప్రతి నెలా ఆహార గింజలు సరఫరా చేస్తున్నామని కేంద్ర ఆర్థికమంత్రి స్వయంగానే ప్రకటించారు. విద్య, ఆరోగ్యం, మంచినీటి వంటి జీవితావసరాలు పెనుభారమయ్యాయి. ఆర్థికాభివృద్ధి అంటే జి.డి.పి గణాంకాలు, స్టాక్ మార్కెట్ల సూచీలు వంటివి కావు. ప్రజల జీవన స్థితిగతులు మరింత మెరుగుపడటం. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం కేవలం 1 శాతం మంది బడా సంపన్నుల వద్ద 47.5 శాతం సంపద కేంద్రీకృతమైతే, అట్టడుగు 50 శాతం మంది ప్రజల వద్ద కేవలం 3 శాతం సంపద మాత్రమే ఉన్నది. ప్రభుత్వాలకు పన్నులు చెల్లిస్తున్నది కూడా కోట్లమంది సామాన్య ప్రజలే. మొత్తం జి.ఎస్.టి పన్నుల్లో 64 శాతం చిట్టచివరనున్న 50 శాతం మంది నుండి వసూలవుతోంది. బడా కార్పొరేట్లు బకాయి పడ్డ దాదాపు 14 లక్షల కోట్ల రూపాయల రుణాలను ప్రభుత్వం మాఫీ చేయడం దుర్మార్గం కాదా! ప్రజల సొమ్ము కదా అది.



2013–22 కాలంలో బడా కార్పొరేట్లకు ఇచ్చిన పన్ను రాయితీల ఫలితంగా ప్రభుత్వం 8.22 లక్షల కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోయింది. కేవలం ఒక్క కార్పొరేట్ టాక్స్ రూపంలోనే గత ఐదేళ్లలో కార్పొరేట్ వర్గాలు 3.14 లక్షల కోట్ల మేరకు లాభపడ్డాయి. అందువల్ల ఏ ఆర్థిక విధానాలు ఘోరంగా విఫలమయ్యాయో ఆ విధానాలనే బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం మరింత వేగవంతంగా అమలు చేయడం ఈ రకమైన తీవ్ర అనర్థాలకు దారి తీస్తోంది. ఫలితంగా దేశస్వావలంబన అత్యంత ప్రమాదంలో పడింది.

రెండో వైపు రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను కొద్దిమంది ఆర్థికవేత్తలు శాసిస్తున్నారు. విజయ్ మాల్యా, నీరవ్‌మోడీ, లలిత్‌మోడీ వంటి బడా వ్యాపారవేత్తలు తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడి విదేశాలకు పారిపోయారు. ఇప్పుడు గౌతమ్ అదానీతో సహా మరికొంత మందిపై అమెరికాలోని న్యూయార్క్ తూర్పు రీజియన్ కోర్టులో కేసులు నమోదయ్యాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ మరియు సెక్యూరిటీస్ & ఎక్స్ఛేంజ్ కమీషన్ (ఎస్.ఇ.సి) వారిపై తీవ్రమైన అభియోగాలు మోపాయి. సోలార్ విద్యుత్ ఒప్పందాల్లో తీవ్ర అవకతవకలు జరిగినట్లు, ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు రూ. 2029 కోట్ల లంచాలు ముట్టజెప్పినట్లు వారిపై ఆరోపణలు చేశాయి.

గతంలో అమెరికాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చి సంస్థ హిండెన్‌బర్గ్ కూడా ఒక నివేదిక ఇచ్చింది. ఆ నివేదికలో కూడా అదానీ విషయాన్ని ప్రస్తావించింది. ఎయిర్ పోర్ట్‌లు, పోర్టులు, విద్యుత్, బొగ్గు వంటి కీలక రంగాల్లో అదానీ గ్రూప్ ఎలా ప్రవేశించిందో, వేల ఎకరాల భూమిని వారికి ఎలా కేటాయించారో ప్రభుత్వ పెద్దలకే తెలియాలి. 2014 తర్వాత కొద్ది సంవత్సరాల్లోనే ప్రపంచ సంపన్నుల జాబితాలో రెండో స్థానానికి గౌతమ్ అదానీ ఏ విధంగా చేరగలిగాడన్నది ప్రజల ముందున్న పెద్ద ప్రశ్న. దేశ సంపదను ఆయన అంతసులువుగా ఎలా చేజిక్కించుకున్నాడన్నది ప్రజలందరూ ఆలోచించాల్సిన విషయమే.

ప్రభుత్వ విధానాల వల్ల నష్టపోతున్నది సామాన్య ప్రజానీకం. ప్రభుత్వ నిర్వాకాల వల్ల అధిక ధరలు, పన్నుల భారాలు, విద్యుత్ ఛార్జీలు ప్రజలకు పెనుశాపంగా మారాయి. సోలార్ విద్యుత్ ఒప్పందాలలో జరిగిన కుంభకోణాల వల్ల 30 సంవత్సరాల పాటు ప్రజలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఈ భారాలు సుమారు లక్ష కోట్ల వరకూ ఉంటుందని ఒక అంచనా. కెన్యా, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాలు అదానీ గ్రూప్‌తో చేసుకున్న ఒప్పందాలను సమీక్షించే దిశగా ఆలోచన చేస్తున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. అందువల్ల మన దేశంలో కూడా అదానీతో కుదుర్చుకున్న ఒప్పందాలపై తక్షణం విచారణ జరగాలి. ప్రజావ్యతిరేక ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలి. అవినీతికి పాల్పడ్డ వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

మన ప్రజాస్వామ్య, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలపై బడా కార్పొరేట్ల దుష్ప్రభావాన్ని నిలువరించేందుకు ప్రజానీకం సన్నద్ధం కావాలి. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలకై సమైక్యంగా ఉద్యమించాలి.

**(రచయిత మధ్యతరగతి ఉద్యోగ సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్, గుంటూరు జిల్లా)**

# అదాని ప్రదేశ్‌గా రాష్ట్రం




**మంచికలపూడి శివాజి**

**అదానీకి అత్యంత విలువైన ప్రజల ఆస్తులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తోంది. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాం చివరలో మొదలైన ఈ తంతుకు గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా సహకరించింది. ఇప్పుడు మళ్లీ అదే ప్రక్రియ జరుగుతోంది. దీంతో ఆంధ్రప్రదేశ్ కాస్తా అదాని ప్రదేశ్‌గా మారిపోతోంది.**

కేంద్రప్రభుత్వం రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం(ఆర్‌డిఎస్–ఎస్)ను తీసుకొచ్చింది. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలు కూడా అంగీకరించని ఈ స్కీంను వైసిపి ప్రభుత్వం అంగీకరించింది. ఇందులో ప్రధానమైన అంశం వ్యవసాయానికి, ఇళ్లకు, స్మార్ట్‌మీటర్లు ఏర్పాట్లు. ఈ స్కీం ప్రకటించిన సమయంలోనే అదానీ గ్రూప్ స్మార్ట్ మీటర్ల ఉత్పత్తి రంగంలోకి అడుగుపెట్టింది. రాష్ట్రంలో ఈ మీటర్లను బిగించే కాంట్రాక్టులను షిర్డిసాయి ఎలక్ట్రికల్స్‌తో పాటు అదానీకి రాష్ట్రప్రభుత్వం కట్టబెట్టింది. దేశవ్యాప్తంగా 2.3 కోట్లు స్మార్ట్‌మీటర్లను ఈ ఏడాది మార్చి వరకు అదాని కంపెనీ బిగించింది. రాష్ట్రంలో 41.80 లక్షల మీటర్లను రూ.5200 కోట్లతో ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలకు బిగిస్తోంది. అదానీ ఉత్పత్తి చేసే సోలార్ పవర్‌ను వ్యవసాయ విద్యుత్ పేరుతో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ (సెకి) నుంచి యూనిట్‌కు రూ.2.49లకు తీసుకునేలా ఏడు వేల మెగావాట్ల ఒప్పందం విద్యుత్ పంపిణీ సంస్థలు కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంలో అవినీతి జరిగినట్లు అమెరికాలో కేసు నమోదైన సంగతి తెలిసిందే. అదేవిధంగా 6,200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే 5 పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను అప్పగించింది. జెన్‌కో థర్మల్ కేంద్రాలకు విదేశీ బొగ్గు సరఫరా సరఫరా టెండర్లనూ అదానీ సంస్థ వదల్లేదు. కృష్ణపట్నం ప్లాంట్‌కు 7.5 లక్షల టన్నుల విదేశీ బొగ్గు టన్నుకు రూ.13,100 చొప్పున సరఫరా చేసే పనులనూ అదానీకే ప్రభుత్వం కట్టబెట్టింది. ఇది కాకుండా వైఎస్ జగన్ సిఎం హోదాలో వెళ్లిన దావోస్ పెట్టుబడుల సదస్సులో 10వేల మెగావాట్లకు సంబంధించిన సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుకు ఒప్పందం కుదిరింది.

### పోర్టులు

కృష్ణపట్నం పోర్టులో 75 శాతం వాటాను 2020 అక్టోబరులో అదాని సంస్థ దక్కించుకుంది. మిగిలిన 25 శాతాన్ని 2021 ఏప్రిల్ 5వ తేదిన రూ.2800 కోట్లకు అదాని దక్కించుకుంది. గంగవరం పోర్టు లిమిటెడ్‌లో రాష్ట్రప్రభుత్వానికి ఉన్న 10.4 శాతం ఈక్విటీని రూ.645.10 కోట్లకు అదాని సంస్థకు ప్రభుత్వం విక్రయించింది.

### విశాఖలో డేటా సెంటర్

2014–19లో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2019 జనవరి 14న విశాఖలో గ్రీన్ డేటా సెంటర్ పేరుతో విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టు విలువ రూ.70వేల కోట్లు. అనంతరం జగన్ ప్రభుత్వం రెండుసార్లుగా రూ.3058 కోట్లు విలువ చేసే 190.29 ఎకరాలను భూములను కట్టబెట్టింది.

### మైనింగ్

ఎపి ఖనిజాభివృద్ధి సంస్థ(ఎపిఎండిసి)కు మధ్యప్రదేశ్‌లోని సులియారీలో ఉన్న బొగ్గు ప్రాజెక్టు నుంచి తవ్వితీసే బొగ్గును కొనుగోలు చేసే టెండర్లను ప్రభుత్వం అడ్డగోలుగా అదానికే కట్టబెట్టింది. రాష్ట్రంలో మూడు బీచ్ శాండ్ లీజుల్లో తవ్వకాలను అదాని సంస్థలకు కట్టబెట్టేందుకు గత ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేసింది. ఎపిఎండిసి పేరుతో శ్రీకాకుళం జిల్లా గారలో రెండు లీజుల్లో 909.85 హెక్టార్లు, విశాఖ జిల్లా భీమునిపట్నం పరిధిలోని 90.15 హెక్టార్లలో ఒక లీజు మొత్తం వెయ్యి హెక్టార్లలో ప్రాజెక్టు డెవలపర్ అండ్ ఆపరేటర్ ఎంపికకు గత ఏడాది డిసెంబర్‌లో టెండర్లు పిలవగా అదాని కాకుండా మరో రెండు సంస్థలు వచ్చాయి. బిడ్ దక్కితే వారంలో రూ.100కోట్లు జమ చేయాలనే నిబంధనపై హైకోర్టులో పిల్ వేయడంతో ఈ ప్రక్రియ ఆగింది.

### పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్ ప్రాజెక్టుల వివరాలు

| ప్రాజెక్టు సామర్థ్యం (మెగావాట్లు) | ప్రాంతం |
|---|---|
| 1000 | గండికోట, కడప |
| 500 | చిత్రావతి, సత్యసాయి |
| 1200 | కురుకుర్తి, విజయనగరం జిల్లా |
| 1000 | కర్రివలస, విజయనగరం జిల్లా |
| 1500 | పెదకోట, అల్లూరి జిల్లా |
| 1000 | రైవాడ, అనకాపల్లి జిల్లా |

ప్రజాశక్తి



# అవినీతి కిలాడీలు

## రక్షణలో పాలకులు



# ఆపరేషన్ 'సేవ్ అదానీ'

తెలకపల్లి రవి

అమెరికాలో బహిర్గతమైన అదాని లంచాల కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరపాలనీ, ఆ సౌర విద్యుత్ సరఫరా ఒప్పందాన్ని రద్దు చేయాలనీ ప్రతిపక్షాలు కోరుతున్నాయి. అయితే మీడియాలో పెద్ద భాగం అదాని చేతుల్లో వుండగా, మొత్తంగా బిజెపి ప్రాబల్యం సాగుతుంది. అందుకే పరిమితంగా వార్తలు తప్ప జాతీయంగా ఆయన కుంభకోణాలపై ఎలాంటి నిశిత పరిశోధన గానీ, అక్రమాల వివరాలు గానీ రావడం లేదు. బయటకు వచ్చిన వాటిని కూడా తొక్కిపట్టే, వెనక్కు నెట్టే కుట్రలు సాగుతున్నాయి. మొత్తంగా అదానిని రక్షించే ప్రక్రియ నడుస్తున్నది.

### కేంద్రం మూగనోము

ఈ వ్యవహారం ప్రధాని మోడీతో మొదలవుతుంది. అవినీతిపై సింహస్వప్నం నేనేనంటూ వీరంగం తొక్కే మోడీ హయాంలోనే అదానీ అమాంతం పెరిగిపోవడం మొదలైంది. చిన్న ఆరోపణలకే ప్రత్యర్థి నేతలపై సిబిఐ, ఇడి, ఐటి లతో త్రిశూల వ్యూహం ప్రయోగించే ఆయన అదానిపై కొండంత ఆరోపణలు వచ్చినా చలించలేదు. తన విదేశీ పర్యటనలలో అదానీలకు అనుకూలంగా పనిచేసిన సందర్భాలున్నాయి. ఆస్ట్రేలియా బొగ్గు గనుల కేటాయింపు, శ్రీలంకలో కాంట్రాక్టుల విషయంలో ఆయన పాత్ర చర్చకు కారణమైంది. అదాని గ్రూపు రుణాల సేకరణలోనూ, షేర్ల మార్కెట్‌లో విలువలు పెంచి చూపుతూ మాయ చేయడంలోనూ మోసాలకు పాల్పడిందని నివేదికలు వచ్చినా, కేసులు నడిచినా కేంద్రం జోక్యం చేసుకోకుండా వారు కోలుకోవడానికే తోడ్పడింది. ఇప్పుడు కూడా అమెరికాలో వచ్చిన ఆరోపణలకు ఇండియాలో చట్టబద్ధత లేదని, కేంద్రం గురించి ఏమీ చెప్పలేదని బుకాయిస్తున్నది. ఆరోపణలకు గురైనవన్నీ బిజెపియేతర ప్రభుత్వాలేనని రాజకీయంగా మాత్రం దాడి చేస్తున్నది. మరి ప్రతిపక్ష రాష్ట్రాలపై ఎందుకు దర్యాప్తు చేయడం లేదు? అదానికి నష్టం గనక. సెకీ కేంద్ర సంస్థ అయినప్పుడు రాజ్యాంగపరంగా, నైతికంగా దాని చర్యలకు బాధ్యత తీసుకోవాలి కదా? గతంలోలాగే ఇప్పుడూ పార్లమెంటులో అదానిపై చర్చకు తిరస్కరిస్తూ వాయిదాలతో కాలక్షేపం చేస్తోంది. ఆరోపణల్లో అధిక మొత్తానికి సంబంధించిన ఎ.పిలో ఎన్‌డిఎ సర్కారు వున్నా ఏ చర్యకూ సిద్ధపడటం లేదంటే అభయం ఇస్తున్నారనేది స్పష్టం. విశ్వగురు బిరుదాంకిత మోడీజీ విశ్వవ్యాపితంగా అప్రతిష్ట తెచ్చే అదానిని మాత్రం అంటుకోరనేది ప్రపంచమంతటికీ తెలిసిన రహస్యం. అదానిపై ఆరోపణలు జార్జి సొరోస్ కావాలనే చేయిస్తున్న అంతర్జాతీయ కుట్ర అని సంఘ పరివార్ ప్రచారం చేస్తోంది. హిండెన్ బర్గ్ నివేదికపైనా గతేడాది మంత్రి స్మృతి ఇరానీ నేరుగా ఇదే ఆరోపణ చేశారు. అదానీని సమర్థించడం దేశభక్తికి నిదర్శనమని వారి భావన.

### డోనాల్డ్ ట్రంప్, అమెరికా

మరోసారి అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన ట్రంప్ కూడా ఇంతటి ఆరోపణలపైన పెదవి విప్పింది లేదు. అధ్యక్షుడికి వుండే విశేష అధికారాలతో ఆయన అధికారం చేపట్టాక అదానీపై కేసులు రద్దు చేసే అవకాశం వుందని రవి బాత్రా అనే సీనియర్ కౌన్సిల్ ప్రకటించారు. కోర్టుల్లో విచారణ గాక న్యాయశాఖ వీటిని నమోదు చేసింది గనక మందలింపు, జరిమానా వంటి వాటితోనూ ముగించవచ్చునని కొన్ని వార్తలు. ఇక వైట్‌హౌస్ ప్రతినిధి జీన్ పియర్ ... ఈ ఆరోపణల వల్ల భారత అమెరికా సంబంధాలపై ఎలాంటి ప్రభావం వుండబోదని చెప్పేశారు. మామూలు భాషలో చెప్పాలంటే మోడీకి నచ్చని పని చేయబోమని భరోసా ఇస్తున్నారనుకోవాలి. విదేశీ వ్యాపారాలను అధిక సుంకాలతో హడలగొడతానంటున్న ట్రంప్ అదానీపై ఇంత ఉదారంగా వుండటం వెనక రహస్య బంధాలేమిటి?

### జగన్, వైసిపి మీడియా

మరోవైపు జగన్ అదాని ఎనర్జీతో సౌర విద్యుత్ కొనుగోలుపై సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి) లేఖ రాసిన తర్వాత నెల రోజుల పైన ఆలోచించి వారితోనే ఒప్పందానికి సంతకాలు చేశామని, అదానీలతో తమకు సంబంధం లేదని వాదించారు. చంద్రబాబు హయాంలో రూ.5కు పైన వున్న యూనిట్ ధరను తాము రూ.2.49 పైసలకు తగ్గించామని, దీనివల్ల పాతికేళ్లలో రూ.లక్ష కోట్లు మిగులుతాయి గనక సంపద సృష్టి అని చెప్పారు. అయిదేళ్ల పాలనకు ఎన్నికైన సర్కారు పాతికేళ్ల ఒప్పందాలకు కట్టుబడటమే ఒక విపరీతం. గుజరాత్‌లోనే ప్లాంటు వుంది గనక ఆ రాష్ట్రానికి ట్రాన్స్‌మిషన్ చార్జీలు తక్కువంటున్న జగన్ తమకు సరఫరా చార్జీల భారం సెకీ రద్దు చేసింది గనక వారు ఎక్కడి నుంచి తీసుకొస్తారనేది అనవసరమన్నారు. రివర్స్ టెండరింగ్ అంటూ ముందు టెండర్లను పూర్తిగా తిరగదోడిన జగన్ భవిష్యత్తులో ఇది మక్కీకి మక్కీగా అమలై లక్ష కోట్లు వస్తాయని ఎలా వాదించగలుగుతున్నారు? మిగిలిన అయిదు రాష్ట్రాలు కూడా ఆరోపణలకు గురవుతున్న సంగతి చెప్పడం లేదు. అప్పుడూ ఇప్పుడూ బిజెపికి లోబడి వున్నారు గనక కేంద్రం బాధ్యత వహించాలనీ చెప్పడానికి సాహసించలేరు. అమెరికాలో దర్యాప్తు సంస్థలకు తమ పార్టీ మీద లేదా తన మీద ఎందుకు కోపముంటుంది? టిడిపి కుట్రల గురించి ఎంతైనా చెప్పొచ్చు గానీ వారు అమెరికానూ మేనేజ్ చేసి ఆరోపణలు తెప్పించగలరా? అదానీలపై ఆరోపణలే అబద్ధమని ఆయన అంటున్నారా? చాలా రివర్స్ టెండర్లలో పాత కంపెనీలను మార్చిన ఆయన ఇక్కడ మాత్రం ఎందుకు కొనసాగించారు? కృష్ణపట్నం, గంగవరం వంటివి కూడా కట్టబెట్టడానికి కారణమేమిటి? అమెరికా ఆరోపణలలో ఎక్కడా తన పేరు రాలేదని చెబుతున్న మాజీ సిఎం ఎపిలో నెంబర్1 అఫిషియల్ అంటే తానుగాక మరెవరో చెప్పాలి కదా? తనపై వ్యక్తిగత ఆరోపణలు చేసిన పత్రికల మీద కేసు వేయడానికి ఆయనకు హక్కు వుంది గానీ ఈ ఆరోపణల తీగ లాగిన అమెరికా సంస్థలను ఏం చేస్తారు?




## సెకి స్పందన

ఈ మొత్తం వ్యవహారంలో కేంద్ర బిందువు లాంటిది సెకి. చాలా ఆలస్యంగా, అదీ అనేక విమర్శల తర్వాతనే స్పందించింది. పునరుత్పాదక ఇంధనాలు (రెన్యూవబుల్ ఎనర్జీ) కొనుగోలు చేయాలనుకునే రాష్ట్రాల విద్యుత్ సంస్థలకూ, అమ్మడానికి ముందుకొచ్చే కంపెనీలకు మధ్యవర్తిగా వుండటం, వారి వారి ప్రతిపాదనలను తీసుకుని తుది ఒప్పందం ఖరారు చేయడం, అందుకు అవసరమైన రుణాలు సమకూర్చడం, అవసరమైతే వనరులతో తేడాలు భర్తీ చేయడం, సరఫరా వ్యవస్థను అమర్చడం తన పనిగా చెప్పింది. అంటే అమ్మేవారికి ముందు పవర్ అవార్డు ఒప్పందాలు (పిఎఎ) జారీ చేస్తుంది. పవర్ సేల్స్ ఒప్పందాలు (పిఎస్ఎ లు), కొనేవారితో పవర్ పర్చేజ్ ఒప్పందాలు (పిపిఎ లు) కుదురుస్తుంది. అదాని వివాదంతో సంబంధం లేనట్టు సాధారణ ప్రకటనగా ఈ సమాచారం విడుదల చేయడం గమనించదగింది. అదానీలకే భారీగా పిఎఎలు ఇవ్వడం ఒక పథకం ప్రకారమే జరిగింది. వారి రేట్లు ఎక్కువగా వుండటంతో ఎవరూ కొనడానికి సిద్ధం కాలేదు. దాంతో రేటు తగ్గించి మరో రూపంలో ముందుకొచ్చారు. వారితో పాటు తక్కువ పరిమాణంలో సరఫరాకు అవార్డు పొందిన అజూర్ కంపెనీకి భారీ ముడుపులు చేత కాలేదు. దాంతో అదానిలు అజూర్‌ను కూడా కలుపుకున్నారు. గౌతం అదాని స్వయంగా జగన్‌ను మూడుసార్లు కలిసి రేట్లు మాట్లాడుకున్నారు. తర్వాత మొత్తం తామే తీసుకున్నారు. అంతా కుదిరిన తర్వాత సెకితో పిపిఎలు ఖరారు చేశారు. అమెరికా కేసులో తమ పేరే రాలేదని సెకీ చైర్మన్ సమర్థించుకోవడం నిజంగా హాస్యాస్పదం. కేంద్ర సంస్థగా సమన్వయం, నిధుల కల్పన, లోటు భర్తీ వంటి పనులు ఏ పాత్ర లేకపోతే ఎందుకు చేస్తారు? కనుక నిమిత్త మాత్రులమేనన్నట్టు సెకీ మాట్లాడటం తప్పించుకునే ప్రయత్నమే. తాము సెకీతోనే సంతకాలు చేశామని జగన్ అంటుంటే, మా బాధ్యత లేదని వారనడంలో పొంతనేదీ?

## రంగంలోకి రోహత్గీ

జగన్ తమ సర్కారు తప్పు చేయలేదని సమర్థించుకోవడం ఒకటైతే- అసలు అదానిలకే వంత పాడటం మరింత విపరీతం. సూపర్ సీనియర్ అడ్వకేట్ ముకుల్ రోహత్గీ, మహేష్ జెఠ్మలానీ అదానీ కంపెనీపై అవినీతి ఆరోపణలే రాలేదని వింత వాదనతో ముందుకొచ్చారు. వారి పత్రిక ఆ వాదనలను దాదాపు పతాక స్థాయిలో ప్రచురించింది. రోహత్గీ స్కిల్ కేసులో చంద్రబాబుకు వ్యతిరేకంగా జగన్ ప్రభుత్వం తరపున వాదించిన సీనియర్ అని తెలుసుకుంటే ఆశ్చర్యం కలగొచ్చు. కానీ కార్పొరేట్ లాయర్ల లావాదేవీలు అలానే వుంటాయి. యుఎస్ 'ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్' (ఎఫ్‌సిపిఎ) కింద ఆరోపణలకు ఆధారాలు లేవనీ, అదానీల పేర్లే లేవని పల్లవి ఎత్తుకున్నారు. ఆధారాలు లేకపోతే కోర్టుల దాకా వెళ్లే పని లేకుండా న్యాయశాఖ తానే కొట్టేయవచ్చు. ట్రంప్ పగ్గాలు చేపట్టాక అదానీల కేసు రద్దు చేయొచ్చని రవి బాత్రా చెప్పింది మరింత సూటిగా వుంది. ఈ మేరకు మోడీ సర్కారు సంకేతాలు వుండొచ్చని కూడా భావిస్తున్నారు. ఒక వేళ అమెరికా సమన్లు జారీ చేసినా, అవి సాంకేతికంగా ఇండియాలో చెల్లవని మీడియాలో భారీ ప్రచారం సాగింది.

## చంద్రబాబు, పవన్ సన్నాయి నొక్కులు

ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన ప్రభుత్వం సన్నాయి నొక్కులు అన్నిటికన్నా ఆశ్చర్యం అనిపించవచ్చు గానీ ఎన్‌డిఎ కూటమిలో మోడీ నాయకత్వంలో వారి పరిస్థితి అది. పైగా జగన్ ఓడిపోయాక కూడా అదానితో టిడిపి ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలు, కేటాయింపులు తక్కువ కాదు. మోడీతో అవగాహన సరేసరి. తలకు గాయం తగలకుండా నెత్తి మీద కాయ కొట్టినట్టు మోడీని నొప్పించకుండా, తాము చేసిన వాటికి ఇబ్బంది లేకుండా జగన్‌ను మాత్రమే టార్గెట్‌గా చేసుకొని చర్య తీసుకోవడం సంక్లిష్ట వ్యవహారం. సాధారణ అవినీతి ఆరోపణల కింద సెక్షన్ 17(ఎ) గవర్నర్ దగ్గర అనుమతి తీసుకుని కేసు పెట్టాలని చూస్తున్నట్టుంది. అదానితో మొత్తం ఒప్పందాలను కనీసం సౌర విద్యుత్ కొనుగోలును రద్దు చేయాలని వామపక్షాలు, సిపిఎం ఎంతగా పోరాడుతున్నా... అందుకు సాహసించడం లేదు. ఆ ఆలోచనే లేదని కూడా మీడియాకు కథనాలు లీక్ చేశారు. ఒప్పందం రద్దు చేయాలని కోర్టులో కేసు వేసిన పయ్యావుల కేశవ్ ప్రస్తుతం ఆర్థికమంత్రిగా వున్నా నోరు మెదిపింది లేదు. సనాతన ధర్మం రక్షణ కోసం సమర శంఖాలు పూరించే పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా వున్నా చర్చించి నిర్ణయం తీసుకుంటామంటున్నారు. ఈ వివాదం తర్వాత శాసనసభ రెండు రోజులు జరిగినా మమ అనిపించారే గాని నిప్పులు కక్కడం, చొక్కాలు చించుకోవడం ఏమీ జరగలేదు. అదానితో ఒప్పందాలు రద్దు చేసుకోవడం పెట్టుబడులు పెట్టే వారికి తప్పుడు సంకేతం అవుతుందని ప్రభుత్వ వర్గాలు మీడియాకు చెప్పాయి. సరఫరా చార్జీలు లేనే లేవని జగన్ అంటుంటే, వాటిని రద్దు చేయించుకుని ఒప్పందాన్ని కొనసాగించుకుందామని సర్కారు భావిస్తున్నట్టు టైమ్స్ ఆఫ్ ఇండియా వివరమైన ప్రత్యేక కథనం ఇచ్చింది. మోడీ, బాబు, జగన్, పవన్, రోహత్గీ, ట్రంప్ ఇలా ప్రపంచ కార్పొరేట్ కుబేర సామ్రాజ్య బంధాలు ఎలాంటివో, ప్రపంచీకరణలో ద్రవ్య పెట్టుబడుల పట్టు ఎంత బలంగా పాతుకుపోయిందో వీటిని బట్టి స్పష్టమవుతుంది.


## అదాని ఎనర్జీ పాట

ఇక అదాని గ్రీన్ ఎనర్జీస్ లిమిటెడ్ (ఎజిఇఎల్) కూడా స్వయంగా ముందుకొచ్చి తమపై అవినీతి నిరోధక చట్టం ఆరోపణలేమీ రాలేదని ప్రకటించుకుంది. చైర్మన్ గౌతం అదాని, సోదరుడి కుమారుడైన సాగర్ అదాని, సీనియర్ డైరెక్టర్ వినీత్ జైన్‌లపై వచ్చినవి కుట్ర, మోసం, ఆరోపణలు మాత్రమేనని, వాటికి కొద్దిపాటి జరిమానాలు మాత్రమే వుంటాయని వివరణ ఇచ్చింది. ఏదో భరోసా లభించింది గనకే వారు ఇలా చెప్పి వుంటారనేది తథ్యం. అలాంటి ప్రకటన ఏదో త్వరగా వస్తే మొత్తం చాప చుట్టేయొచ్చునని చూస్తున్నట్టు కనిపిస్తుంది.

## రేవంత్ వివాదం, కేరళ అనుభవం

ఇతర రాష్ట్రాలలోనూ అదానీ వివాదం సెగలు రేపింది. ముఖ్యంగా కాంగ్రెస్ పాలించే తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం అదానితో ఒప్పందాలు చేసుకోవడంపై రాహుల్ గాంధీకి ప్రశ్నలు ఎదురయ్యాయి. సాధారణ తరహాలో కుదిరే పెట్టుబడి ఒప్పందాలకు తాము వ్యతిరేకం కాదని రాహుల్ జవాబు చెప్పారట. అయితే హైదరాబాద్‌లో స్కిల్ యూనివర్సిటీకి విరాళంగా అదాని గ్రూపు పంపిన వంద కోట్లు మాత్రం తిప్పి పంపేస్తున్నట్టు రేవంత్ ప్రకటించారు. అంటే మిగిలిన ఒప్పందాలను కనీసంగా పున:పరిశీలిస్తామని కూడా చెప్పలేదు.

ఇందుకు భిన్నంగా కేరళలో పినరయి విజయన్ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వింజినం రేవుపై కుదుర్చుకున్న ఒప్పందాన్ని సమీక్షించి అనుబంధ ఒప్పందంలో అనేక రాయితీలను సాధించడం చూస్తాం. 2045లోగా పూర్తి చేయాలని వున్నదాన్ని 2028కే పూర్తి చేయాలని మార్చారు. మొదటి దశలో 10 లక్షల టన్నుల సామర్థ్యం అన్న కంటైనర్లను 30 లక్షల టన్నులకు పెంచారు. ఇక రేవుపై ఆదాయం పంచుకునే విషయంలోనూ 2039 గడువును 2034 నాటికి తీసుకొచ్చారు. ప్రభుత్వ వాటా చెల్లింపు రూ.774 కోట్లు వుండగా, దాన్ని రూ.365 కోట్లకు తగ్గించారు. ఇలా రాష్ట్రాలు తమ ప్రయోజనాలు సాధించుకునేలా ఒప్పందాలను మళ్లీ మార్చుకునే హక్కు వుంటుంది. అలాంటి సమీక్ష చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం సూటిగా చెప్పడం లేదంటే మోడీ సర్కారు అదాని లాభం తగ్గించడానికి ఒప్పుకోవడం లేదని భావించాలి.




## ఏకోదర నీతి !

పేదోళ్ల ప్లేటులో మాయమౌతున్న
అన్నం మెతుకులు
పెద్దోళ్ల జేబుల్లో పోగుబడుతున్న
అమెరికా డాలర్లు
కర్మాగారాలు కార్మికుల
శ్రమశక్తికి దేవాలయాలు
విమానాశ్రయాలు ఓడరేవులు
ప్రభుత్వరంగంలోని ప్రజల సొమ్ములు
ప్రతిదీ వీడి జేబుల్లోకే ఇప్పుడు
ప్రజలెన్నుకున్న నాయకులూ
వీడి చేతుల్లోనే ఎప్పుడూ...


అదృశ్య హస్తాలతో ప్రజల సొమ్మును
ఆవాహన చేసుకునే రాక్షసాధముడు వీడు
అవకాశాల అవసరాలకు
లంచాల మరుగుమందులిచ్చి
అధ:పాతాళ గంగను కూడా
చుక్క లేకుండా చేదే
మహా మాయగాడు వీడు
ప్రకృతి వనరులన్నీ వీడి గుప్పెట్లోనే
ప్రజల మానప్రాణాలూ వీడి చెరలోనే

గనుల దొంగ వీడు...
బూర్జువా ఆర్థికాసురుడు వీడు
అవినీతికి అసలుసిసలు
 వారసుడు వీడు
బొగ్గు నుంచి పోర్టుల దాకా...
సముద్రం నుంచి ఆకాశం దాకా
వీడి అవినీతి పుట్టలోంచి
పుట్టుకొచ్చిన స్కాములే...
కాదేదీ వీడి దోపిడీకి అనర్హం
లేదెక్కడా వీడ్ని అడ్డుకునే యంత్రాంగం
వీడి ప్రజాస్వామ్య ముసుగు మోదానీ
వీరి చరిత్ర అంతా మోసాలమయమే...

వారే...
స్కాముల సూత్రధారి అదాని
స్కాముల్లో పాత్రధారి బిజెపీ
అవినీతి దోపిడీ రెండు తలల కాలసర్పం
అదానీ బిజెపీ ఏకోదర సంతానం
ఆర్థికవ్యవస్థను తొలిచే వేరుపురుగులు
మట్టికాళ్ల మహారాక్షసి క్రోనీ క్యాపిటలిజం
మట్టిలో బోలు మొదలయ్యేంతవరకే
దాని ప్రతాపం


– రాజాబాబు కంచర్ల

## సిఎంతో మాట్లాడతాం



అదానీతో జగన్ చేసుకున్న సౌరవిద్యుత్ ఒప్పందానికి సంబంధించిన అవినీతి ఆరోపణలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ అంశంపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సిఎం చంద్రబాబునాయుడుతో మాట్లాడతాం. అదానీ అంశంపై లోతైన దర్యాప్తు జరగాలని వ్యక్తిగతంగా నా అభిప్రాయం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైఖరికి సంబంధించినది కాదు. ఏదైనా తప్పులు జరిగితే న్యాయం జరిగేలా సమగ్ర విధానాన్ని రూపొందించాలని కోరుతున్నాను.

**కె.పవన్ కల్యాణ్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి**



## ఇంత వేగంగానా...!?



అదాని గ్రూపు విస్తరణ జరిగిన తీరుపై అమెరికా దర్యాప్తు అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. కోర్టుకు సమర్పించిన ఛార్జ్‌షీట్‌లో ఈ విషయాన్ని ప్రస్తావించారు. 2016వ సంవత్సరం ప్రారంభంలో ఈ గ్రూపునకు చెందిన అదాని గ్రీన్‌కు ఒక పవర్ ప్రాజెక్టు మాత్రమే ఉందని, దాని సామర్థ్యం కేవలం 20 మెగావాట్లు మాత్రమేనని తెలిపారు. రెండు సంవత్సరాల కాలంలో 2018 నాటికి .ఆ సంస్థ 1,998 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని సంతరించుకుందని పేర్కొన్నారు. 2022వ సంవత్సరాంతానికి ప్రారంభ ఉత్పత్తికి ఐదు రెట్లు అదనపు ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని, దానిని సాధించడంతోపాటు, భారతదేశంలోనే అతి పెద్ద ఉత్పత్తి సంస్థగా ఆవిర్భవించిందని తెలిపారు.

## గంప కింద గజదొంగ

అక్కడ ...
ఇక్కడి గంప కింద గజదొంగ
అగ్ర దేశానికి దొరికాడు
అంతర్జాతీయ వేదికపై
వికసిత్ భారత్ పరువు పతాకను
ఎంచక్కా ఎగరేశాడు!
మన ముక్కును తాకని ఆ అవినీతి కంపు
అంతటా విస్తరించి
విశ్వగాలిని కలుషితం చేస్తోంది!
చీ.. చీచీ.. అంటూ ఆ దేశాలు
ఆ అధ్వానాన్ని కడుక్కుంటున్నాయి
దొంగను బోనులో నిలబెట్టి
అసలు రంగు బయటపెట్టాలని
గుర్రుగా చూస్తున్నాయి!
ఇక్కడ...
ఆ దొంగ పరివారం
హైరానా పడిపోతోంది
"మోషా'లం మేముండగ
దొంగకేమిటి బెంగ
మసి అంటనిస్తామా?
మచ్చ కనబడనిస్తామా?
వాణ్ని బోను ఎక్కనివ్వం
ఎవ్వరికీ చిక్కనివ్వం
ఆ దొంగ ధనమే
మాకు ఇంధన స్వరం
వాని దర్జానే మా దర్పం

అతడే మేము..
మేమే అతడు..
ఇంకెలా పట్టుకుంటారు
మా బంగారు దొంగని
మా 'ఆమ్‌ఆదాని'ని!' అంటూ
దేశభక్తి చాటుతోంది!

– ఎల్.శాంతి

# సెకి గులాంగిరీ మాటేమిటి?

## ఆ ఏజెన్సీ కేంద్రంగానే అదాని అడ్డగోలు దోపిడీ

## మోడీ ప్రభుత్వ అండ లేకుండా అసాధ్యం • సిపిఎస్‌యు పాత్రను కప్పిపుచ్చుతున్న బిజెపి సర్కారు

కెఎస్‌వి ప్రసాద్




విద్యుత్ అమ్మకాల కాంట్రాక్టులను దక్కించుకొని ప్రభుత్వ, ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు అదాని, ఆయన సంస్థలు పలు రాష్ట్ర ప్రభుత్వాధీశులకు భారీగా లంచాలు ముట్టజెప్పారన్న అభియోగాల కేసుపై అమెరికా ఫెడరల్ కోర్టులో విచారణ జరుగుతోంది. అదానీతో నేరుగా ఒప్పందాలు లేవు, మేం కుదుర్చుకున్నది కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన సౌర శక్తి కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి)తోనని లంచాల ఆరోపణలెదుర్కొంటున్న పెద్దలు చేస్తున్న వాదన. కేంద్ర ప్రభుత్వమేమో, నాడు ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న విపక్ష పార్టీ ప్రభుత్వాలే అదాని నుంచి ముడుపులు తీసుకున్నాయని, ఆ రాష్ట్ర ప్రభుత్వాలపై చర్యలు తీసుకోవాలని, తమకు సంబంధం లేదని 'గజం మిథ్య పలాయనం మిథ్య' వలే జారుకుంటోంది. కానీ తప్పుడు పద్ధతుల్లో సౌర విద్యుత్ రంగంలో అదాని అడ్డగోలు దోపిడీకి కేంద్ర బిందువు సౌర శక్తి కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి). పిపిఎల వ్యవహారం అంతటికీ కర్త కర్మ క్రియ అన్నీ ఆ సంస్థేనన్న వాస్తవానికి మసిపూసి మరుగున పడేయాలని మోడీ సర్కారు నానా తంటాలూ పడుతోంది. దేశంలో పవన, సౌర, ఇతర సంప్రదాయేతర పునరుత్పాదక ఇంధన సామర్థ్యం అభివృద్ధి, విస్తరణ ఉద్దేశంగా 2011లో నెలకొల్పబడ్డ 'నవరత్న' హోదా కలిగిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ సెకి. కొత్త, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ పరిధిలోనిది. తొలుత ఈ సంస్థను లాభాపేక్ష లేని కార్పొరేషన్‌గా 1956 కంపెనీల చట్టంలోని సెక్షన్ 25 కింద నెలకొల్పారు. మోడీ ప్రభుత్వం వచ్చాక 2015లో కంపెనీల చట్టం- 2013లోని సెక్షన్ 3 కింద పక్కా కమర్షియల్ సంస్థగా మార్పు చేశారు. సెకి, దేశంలో సౌర, పవన, ఇతర పునరుత్పాదక ఇంధన అభివృద్ధికి జాతీయంగా సహకారం అందించే ఏజెన్సీ. విద్యుత్ సేకరణ, వర్తకం, మార్కెట్ పెట్టుబడులతో పునరుత్పాదక ఇంధన వనరుల విస్తరణను వేగవంతం చేయడం ఈ సంస్థ విధుల్లో ముఖ్యమైనవి. అందుకోసం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రాజెక్టులు స్థాపించడానికి, డెవలపర్లను ఎంపిక చేస్తుంది. బిడ్డర్లను ఎంపిక చేశాక, వారితో పాతికేళ్లకు పిపిఎలు కుదుర్చుకుంటుంది. టారిఫ్ (యూనిట్ ధర) ప్రాతిపదికన డెవలపర్లను ఎంపిక చేస్తుంది. ఎంపికైన డెవలపర్స్‌తో విద్యుత్ అవసరమయ్యే ప్రభుత్వ సంస్థలను అనుసంధానం చేసి విద్యుత్ సరఫరా ఒప్పందాల (పిఎస్ఎ)లు కుదుర్చుతుంది. సెకీది మధ్యవర్తి పాత్రగా పైకి కనిపించినా ఒప్పందాలు ఆ సంస్థ వేదికగానే జరుగుతాయి.

### దాసోహం

అదానీతో సౌర విద్యుత్ ప్రాజెక్టులను పెట్టించి, అవి ఉత్పత్తి చేసే విద్యుత్‌ను అధిక ధరలపై రాష్ట్ర ప్రభుత్వాల డిస్కంలు కొనుగోలు చేసేలా దోహదం చేసేది సెకీనే. సెకి వద్ద అదాని కోట్ చేసిన టారిఫ్ రేట్లు మార్కెట్ ప్రమాణాల కంటే చాలా అధికంగా ఉండటంతో డిస్కంలు విద్యుత్ కొనుగోలు చేసేందుకు ముందుకు రాలేదు. దాంతో అదాని ఉత్పత్తి చేసే విద్యుత్ అమ్ముడుపోని పరిస్థితి తలెత్తింది. అందుకే ఇద్దరు అదానీలు, అదాని పవర్ సిఇఒ వినిత్ జైన్ సహా మరికొందరు కలిసి రాష్ట్ర ప్రభుత్వాల్లోని అత్యున్నత వ్యక్తులను కలిసి భారీ లంచాలు ఆఫర్ చేసి, తాము ఉత్పత్తి చేసే సౌర విద్యుత్‌ను పెద్ద మొత్తంలో, మార్కెట్‌లో కంటే అధిక టారిఫ్‌పై పాతికేళ్ల సుదీర్ఘకాలంపాటు కొనుగోలు చేసేందుకు చక్రం తిప్పారని వరుస పరిణామాలు తెలుపుతున్నాయి. మొట్టమొదట 2021లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఇటువంటి అడ్డదారి ఒప్పందాలు కుదిరాయని, ఆ తర్వాత మరికొన్ని రాష్ట్రాలతో ఒప్పందాలు కుదిరాయని యుఎస్ కోర్టుకు తెలిపిన నేరారోపణ పత్రంలో పేర్కొన్నారు. కాగా లంచాల ఆరోపణలెదుర్కొంటున్న మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం సెకినే అంతా చేసిందంటున్నారు. సెకి అంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వమే. అదానీ వ్యాపారాభివృద్ధి కోసం సెకి పలు సందర్భాల్లో స్వామిభక్తి ప్రదర్శించింది. 2020లో 'అదాని గ్రీన్ ఎనర్జీ'కి సోలార్ పవర్ ప్రాజెక్టును అందించింది. సెకి అందించిన తొలి సౌర విద్యుత్ ప్రాజెక్టు ఇదే. అదాని కంపెనీకి 'ప్రపంచ నెంబర్‌వన్ గ్రీన్ ఎనర్జీ' ఖ్యాతిని సెకి కట్టబెట్టింది. ఆ అవార్డును అదానీ తన దోపిడీకి బాగా ఉపయోగపెట్టుకున్నారు. అంతేకాదు, వాతావరణ మార్పులపై 2015లో పారిస్‌లో జరిగిన 'కాప్ 21' సమ్మిట్‌లో భారత్‌ను పునరుత్పాక ఇంధన రంగంలో మేటిగా నిలబెడతామని ప్రధాని మోడీ హామీ ఇచ్చారని, ఆ హామీని సాకారం చేస్తామని అదాని ప్రకటించారు. అదానీకి అధిక ప్రాధాన్యతనిచ్చి, ప్రమోషన్ కల్పించి, అదాని సంస్థలు ఉత్పత్తి చేసే విద్యుత్‌ను కొనుగోలుదార్లు ప్రముఖంగా అధిక ధరలకు కొనేలా ఒప్పందాల్లో షరతులు విధించింది కూడా సెకీయే.

## అంతర్గత పత్రాలు లీక్

సెకి అంతర్గత పత్రాలు అదానీకి చేరాయని అమెరికాలో నమోదైన లంచాల కేసు నేరారోపణ పత్రాల్లో ఉంది. సెకి అంతర్గత పత్రాలను చదవడంతోపాటు అవసరమైన సందర్భాల్లో సవరణలు చేశారని పేర్కొంది. సెకి అంతర్గత పత్రాలు బయటకు వెళ్లాయంటే ఆ సంస్థపై అదాని ప్రభావం ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ పెద్దల అండ లేకుండా ప్రభుత్వరంగ సంస్థ అదానీకి అంతగా దాసోహం కాగలదా? సెకి చైర్మన్ ఆర్‌పి గుప్తా, అదాని కేసులో సెకి పాత్ర ఉన్నట్లు యుఎస్ కోర్టు పత్రాల్లో ఎక్కడా పేర్కొనలేదని తప్పించుకుంటున్నారు.